
aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610



నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
బుధవారం
1-07-2026 సంపుటి : 01 సంచిక : 100 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## జూలైలోనూ వర్షాల లోటు

- ఐఎండీ ఆందోళన
- జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం: ఐఎండీ
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాలకు బ్రేక్
- 125 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జూన్‌లో లోటు వర్షపాతం
- ఖరీఫ్ సాగుపై ప్రతికూల ప్రభావం.. 23 శాతం తగ్గిన పంట విస్తీర్ణం
- ఆగస్టు, సెప్టెంబర్లలో మెరుగైన వర్షాల కోసం నిరీక్షణ

3లో

జూలైలోనూ వానలు ముఖం చాటేయనున్నాయి..! 125 ఏళ్లలో ఐదో అత్యల్ప వర్షపాతానికి దేశం చేరువలో ఉండగా, ఎల్‌నీనో ప్రభావంతో రైతుల్లో ఆందోళన పెరిగింది. జూన్‌లో ఇప్పటికే 39 శాతం వర్షలోటు నమోదుకాగా.. జూలైలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. అయితే ఆగస్టు--సెప్టెంబరులో పరిస్థితి కొంత మెరుగయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.



## నేటి నుంచి భారత్‌లో జపాన్ ప్రధాని పర్యటన

- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు.. కీలక ఒప్పందాలకు సన్నాహాలు
- భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సులో పాల్గొననున్న నేతలు
- సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్ సరఫరాపై ప్రత్యేక దృష్టి
- ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు

న్యూఢిల్లీ జూన్ 30( మహాప్రభ )
జపాన్ ప్రధాని సనాయే తకైచి ఇండియాలో పర్యటించనున్నారు. ఆమె జూలై 1 నుంచి 3 వరకు ఇండియాలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో భేటీ అవుతారు. జపాన్, ఇండియా మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార, సాంకేతిక సంబంధాల పురోగతి కోసం చర్చలు జరిపి ఒప్పందాలు కుదుర్చుకుంటారు. 2022 మార్చిలో జరిగిన ఇండియా-జపాన్ సదస్సు తర్వాత జపాన్ ప్రధాని ఇండియా రాబోతుండటం ఇదే తొలిసారి. జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత

-మిగతా 3 లో



## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు బాధ్యతలు

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన నూతన సీఎస్
- ఉద్యోగ విరమణ చేసిన కె. రామకృష్ణారావు
- 2029 ఫిబ్రవరి వరకు కొనసాగనున్న సంజయ్ జాజు సర్వీసు
- పరిపాలనా దక్షతతో పాటు కీలక ప్రాజెక్టులకు సారథ్యం

హైదరాబాద్ జూన్ 30( మహాప్రభ )
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సంజయ్ జాజు మంగళవారం తన బాధ్యతలు స్వీకరించారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టే ముందు ఆయన ఎంసీహెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుంచి నేరుగా సచివాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది ఆయనను పుష్పగుచ్ఛాలతో అభినందించారు.
2029 వరకు సర్వీస్‌లో.....

-మిగతా 3 లో

### రైతు సంక్షేమంపై అసెంబ్లీలో
# చర్చకు సిద్ధం

**పదేండ్ల మీ పాలన...
30 నెలల మా ప్రజా పాలనను సమీక్షిద్దాం**


- రైతుల కోసం 30 నెలల్లో రూ.1,75,000 కోట్లు ఖర్చుపెట్టాం
- కేంద్రమంత్రులు రాష్ట్రానికి ఒరగబెట్టిందేం లేదు
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కల్ల
- రైతు భరోసా నిధుల విడుదల సభలో సీఎం రేవంత్ రెడ్డి
- తొలి విడతగా రూ.2,482 కోట్లు విడుదల

"రైతు సంక్షేమంపై అసెంబ్లీలో బహిరంగ చర్చకు సిద్ధం.. బీఆర్ఎస్‌కు దమ్ముంటే రావాలి" అంటూ సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, తమ 30 నెలల కాంగ్రెస్ పాలనను ప్రజల ముందే పోల్చుకుందామని ప్రకటించిన ఆయన.. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్ అమలులో తమ ప్రభుత్వం చేసిన పనులన్నింటికీ లెక్క చెప్పేందుకు సిద్ధమని స్పష్టం చేశారు.

హైదరాబాద్ జూన్ 30( మహాప్రభ )
రైతు సంక్షేమంపై ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ సభలో పదేండ్ల బీఆర్ఎస్ పాలన...30 నెలల ప్రజా ప్రభుత్వ పాలనపై చర్చిద్దామని చెప్పారు. దీనికి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగా తాను అబద్ధాల పునాదుల మీద పరిపాలన చేయబోనని స్పష్టంచేశారు. తప్పయినా, ఒప్పయినా ఉన్నది ఉన్నట్టే చెప్తాననీ, చెప్పిందే చేస్తానని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదిక

-మిగతా 3 లో





## సింధు జలాలపై పాక్ బెదిరింపులు

- తమ నీళ్లను ఎవరైనా వాడుకుంటే వారి చేతులు నరికేస్తామంటూ భారత్‌కు హెచ్చరిక
- ఒప్పందం రద్దుతో పాకిస్థాన్‌లో తీవ్ర నీటి కటకట
- రక్తం, నీరు కలిసి పారలేవు: ప్రధాని మోదీ
- చర్చలకు ఆస్కారం లేదన్న కేంద్రం
- ఎండిపోయిన సుక్కుర్ బ్యారేజ్
- బీడువారుతున్న బలూచిస్తాన్ వ్యవసాయ భూములు
- భారత్ నిర్ణయంతో కుదేలైన పాక్ ఆర్థిక వ్యవస్థ

న్యూఢిల్లీ జూన్ 30( మహాప్రభ )
పాకిస్తాన్‌కు సింధు నది నీళ్లు ఇవ్వకూడదని భారత్ తీసుకున్న నిర్ణయం పాకిస్తాన్‌ను భారీ దెబ్బకొట్టింది. భారత సరిహద్దులోని పాక్ ప్రాంతాలు తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌ను పాకిస్తాన్ బ్రతిమిలాడాల్సింది పోయి.. బెదిరింపులకు దిగుతోంది. సింధు నదీజలాలు ఇవ్వకుంటే భారత్ అంతుచూస్తామంటూ హెచ్చరిస్తోంది. తాజాగా, పాకిస్తాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ కూడా భారత్‌ను బెదిరించాడు. సింధు నదీ జలాలు పాకిస్తాన్ నీళ్లు అంటూ చెప్పాడు. అంతేకాదు.. తమ నీళ్లను ఎవరైనా వాడుకుంటే వారి చేతులు నరికేస్తామంటూ పరోక్షంగా భారత్‌ను హెచ్చరించాడు.పాకిస్తాన్ సమాచార శాఖ మంత్రి అతౌల్లా తరార్ మాట్లాడుతూ సింధు నదీ జలాలను ఒక ట్యాప్ ద్వారా మన ప్రధానమంత్రి కంట్రోల్ చేస్తున్నారు అంటూ విమర్శించాడు. పాకిస్తాన్‌లోకి ఒక్క చుక్క నీళ్లు కూడా రాకుండా అడ్డుకుంటున్నారన్నాడు. ఇలా ఏకపక్షంగా ఒక దేశం నదీ జలాల ఒప్పందాన్ని

-మిగతా 3 లో

## పాక్‌లో మేం భాగం కాదు..

- పాకిస్థాన్‌కు పీవోకే నిరసనకారుల హెచ్చరిక
- ఆహార పదార్థాల నిలిపివేత కొనసాగిస్తే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటాం
- "మాకు మీ రేషన్ అక్కర్లేదు.. పౌరులను శిక్షించడం ఆపండి"
- పాక్ రక్షణ మంత్రి వ్యాఖ్యలపై మండిపడిన స్థానికులు

రావల్‌కోట్, జూన్ 30( మహాప్రభ )
పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు మంగళవారం నాటకీయ మలుపు తీసుకుంది. పీవోకే పాకిస్థాన్‌లో భాగమే కాదంటూ నిరసనకారులు ప్రకటించారు. ఈ ప్రాంతానికి అత్యవసర ఆహార పదార్థాల నిలిపివేతను కనుక ఇస్లామాబాద్ కొనసాగిస్తే తాము ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుంటామని వారు హెచ్చరించారు. ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద పాకిస్థాన్ అధికారులు ఈ నెల ప్రారంభంలో జమ్ము

-మిగతా 3 లో





## జులై 2న క్యాబినెట్ భేటీ

- మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సమావేశం
- ఏజెండా అంశాల తయారీలో శాఖల బిజీ
- తెలుగు అనువాదంతో నివేదికలు సమర్పించాలి
- సచివాలయంలో అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశం
- 34వ మంత్రివర్గ సమావేశంపై సర్వత్రా ఆసక్తి

హైదరాబాద్ జూన్ 30( మహాప్రభ )
రాష్ట్ర క్యాబినెట్ సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్క ర్ సచివాలయంలో జరగనున్న 34వ సమావేశానికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి మండలిలో చర్చించే ఎజెండా అంశాలను అన్ని విభాగా లు తెలుగు అనువాదంతో సహా సర్క్యులేషన్ ద్వారా ఆమోదించి, జులై ఒకటిన మధ్యాహ్నం ఒంటి గంట లోపు జనరల్ అడ్మినిస్ట్రేషన్‌కు పంపాలని ఆదేశించారు. ఎలాంటి ఎజెండా అంశాలు లేకపోయినా 'నిల్' రిపోర్టును

-మిగతా 3 లో



### ఫడ్నవిస్‌ను కలిసిన
## పవన్ కళ్యాణ్

- రెండు ఆడ పులులు ఇచ్చేందుకు అంగీకారం
- తూర్పు కనుమల్లో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్న పవన్
- ఏపీకి రెండు ఆడ పులులు ఇచ్చేందుకు ఫడ్నవిస్ ప్రభుత్వం అంగీకరించిందని వెల్లడి
- ఫడ్నవిస్‌కు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్

అమరావతి:జూన్ 30( మహాప్రభ )
ప్రస్తుతం ముంబైలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్... మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో సమావేశమయ్యారు. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా తూర్పు కనుమల్లో పులుల సంరక్షణతో పాటు ఇరు రాష్ట్రాల పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల సంతానోత్పత్తి వంటి జన్యుపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమస్యను అధిగమించి, పులుల సంఖ్యను పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఏపీకి రెండు ఆడ పులులను ఇచ్చేందుకు అంగీకరించిందని తెలిపారు.

-మిగతా 3 లో

### ఆశీర్వాద సభల పేరిట సీఎం రేవంత్
# నాటకాలు

**రూ. 30 వేల కోట్ల రైతు భరోసా నిధులు ఎగ్గొట్టారు**

- ప్రచారమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పీఆర్ స్టంట్లు
- యూరియా కొరతపై దృష్టి మళ్లించేందుకే ఈ ఆర్భాటం
- ముదనష్టపు పాలనతో రైతన్నల గొంతు కోస్తున్న కాంగ్రెస్
- ఏడాదికి రూ. 15 వేల హామీ ఏమైంది?
- రుణమాఫీలోనూ అన్నదాతలకు ఘోర మోసం
- కేసీఆర్ 'రైతు బాంధవుడు'.. రేవంత్ 'రైతు ద్రోహి'
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్ జూన్ 30( మహాప్రభ )
రాష్ట్రంలో రైతు భరోసా నిధులు రూ.30 వేల కోట్లు ఎగ్గొట్టి రైతన్నలకు ఎగనామం పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ద్రోహిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న యూరియా కొరత రైతన్నల కష్టాల నుంచి దృష్టిమళ్లించడం కోసమే ఇప్పుడు ఆశీర్వాద సభల పేరుతో ముఖ్యమంత్రి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఒక్క కంప్యూటర్ బటన్ నొక్కితే సరిపోయే రైతు భరోసా నామమాత్రపు నిధుల విడుదలకు ఆర్భాటంగా కేవలం ప్రచారమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పిఆర్ స్టంట్లు చేస్తున్నారని

-మిగతా 3 లో



# ఓటు కోల్పోతే.. బెనిఫిట్స్ కోల్పోతారు

-కర్నాటక సీఎం వార్నింగ్



**బెంగుళూరు జూన్ 30( మహాప్రభ )**
కర్నాటకలో నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ మొదలుపెడుతున్నారు. ఓటర్ల నమోదు కోసం సర్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ప్రజలకు సీఎం డీకే శివకుమార్ వార్నింగ్ ఇచ్చారు. ఓటు హక్కును కోల్పోతే.. ప్రభుత్వం పథకాల్లోనూ లబ్ధిని కోల్పోతారని ఆయన తన హెచ్చరికలో పేర్కొన్నారు. ఎన్నికల అధికారుల వద్ద తమ ఓట్లను నమోదు చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఓటు హక్కు అంటే జీవించే హక్కు అని, పశ్చిమ బెంగాల్ సర్కారు ఓ ఆదేశం జారీ చేసిందని, సర్ ఆధారంగా అనర్హులైన ఓటర్లను రేషన్ లబ్ధి నుంచి డిలీట్ చేయాలని ఆదేశించిందని, ఇలాంటి పద్ధతులను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని, ఒకవేళ మీరు ఓటు హక్కును కోల్పోతే, అప్పుడు ప్రభుత్వ లబ్ధి కూడా కోల్పోతారని ఆయన అన్నారు. కర్నాటకలో ఇవాళ్టి నుంచి జూలై 29వ తేదీ వరకు సర్ ప్రక్రియను నిర్వహించనున్నారు. సర్‌కు సహకరించే భాగంగా ప్రజలకు పర్మనెంట్ రెసిడెన్షియల్ సర్టిఫికేట్లను జారీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. రెవన్యూ శాఖకు ఆదేశాలు ఇచ్చామని, ఆన్‌లైన్‌లో కానీ ఆఫ్‌లైన్‌లో కానీ ఆ ధ్రువపత్రాలను పొందవచ్చు అన్నారు. సుమారు 5.5 కోట్ల మంది ఓటర్ల జాబితాను రివిజన్ చేయనున్నట్లు కర్నాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ అన్బుకుమార్ తెలిపారు. సర్ కోసం 59వేల మంది బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు.

# భారత 31వ ఆర్మీ చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతలు స్వీకరణ



**న్యూఢిల్లీ జూన్ 30( మహాప్రభ )**
భారత ఆర్మీ స్టాఫ్ చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇండియాకు 31వ ఆర్మీ చీఫ్. ఇప్పటివరకు ఈ స్థానంలో కొనసాగిన జనరల్ ఉపేంద్ర ద్వివేది రిటైర్ కావడంతో ఆయన స్థానంలో ధీరజ్ సేథ్ నియామకయ్యారు. ఆయన బలమైన, స్వయం సమృద్ధి కలిగిన 1.3 మిలియన్ల భారత ఆర్మీకి నాయకత్వం వహిస్తారు. మహారాష్ట్ర, పూనేలోని ఖడక్‌వాస్లాలో ఉన్న నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందిన జనరల్ ధీరజ్ సేథ్ 1986 డిసెంబర్‌లో భారత ఆర్మీలో చేరారు.ఇంతకుందు ఆయన ఆర్మీ స్టాఫ్‌కు వైస్ చీఫ్‌గా పని చేశారు. అలాగే సౌత్ కమాండ్‌కు, జైపూర్‌లోని సౌత్ వెస్టర్న్ కమాండ్‌కు నేతృత్వం వహించారు. రెండు ఆపరేషనల్ ఆర్మీ కమాండ్స్‌ను నడిపించిన కమాండర్లలో ఆయన కూడా ఒకరు. దాదాపు 40 ఏళ్లుగా ఆర్మీలో వివిధ హోదాల్లో సేవలందిస్తూ, అనేక ఆపరేషన్స్‌లో పాల్గొన్నారు. భారత ఆర్మీని ఆధునీకరించడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. వ్యూహాత్మక ప్రణాళికలు, సైనిక దళాల నిర్మాణం, సామర్థ్యాల పెంపు, సాంకేతికతను అందిపుచ్చుకోవడం, మౌలిక వసతులు వంటి అంశాల్లో కీలక పాత్ర పోషించారు. గత ఏప్రిల్ 1న వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు ఆయన పూనేలోని సౌత్ కమాండ్‌కు నేతృత్వం వహించారు. గత ఏడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ కమాండ్ కీలక పాత్ర పోషించింది.

# త్వరలో నీట్ ఫలితాలు..!




**న్యూఢిల్లీ జూన్ 30( మహాప్రభ )**
ఈనెల 21న నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహించిన విషయం తెలిసిందే. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, భారతదేశంలోని 5,440 కేంద్రాలు, విదేశాల్లోని 14 కేంద్రాలలో జరిగిన ఈ చీజుజు 2026 పునఃపరీక్షకు 20 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. హిందీ, ఆంగ్లంతో సహా మొత్తం 13 భాషలలో ఈ పరీక్ష నిర్వహించారు. తాజాగా నీట్ ప్రొవిజనల్ ఆన్సర్ కీ పై అభ్యంతరాల స్వీకరణ పూర్తి అయిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం తెలిపింది. దాదాపు 10వేలకు పైగా అభ్యంతరాలు వచ్చినట్లు తెలియజేసింది. అతి త్వరలోనే నీట్ ఫలితాలు వెల్లడి కానున్నాయని సబంధింత వర్గాలు పేర్కొన్నాయి. జూన్ 21న, దేశవ్యాప్తంగా, విదేశాల్లోని 14 కేంద్రాలలో 'నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్' 2026కు సంబంధించిన అత్యంత కీలకమైన పునఃపరీక్ష ముగిసింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ఆ సంస్థ ఇప్పటికే పలువురిని అరెస్టు చేసింది.

# వెనిజులాలో భూకంపం.. 1,719కి చేరిన మృతుల సంఖ్య



**హైదరాబాద్ జూన్ 30( మహాప్రభ )**
వెనిజులాలో భూకంప శిథిలాల నుంచి మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. మరణించిన వారి సంఖ్య 1,719కి చేరినట్లు అధికారులు వెల్లడించారు. 5,034 మంది గాయపడ్డారని, 15,866 మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. మరోవైపు రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు కొనసాగిస్తుండగా పలువురు ప్రాణాలతో బయటపడుతున్నారు. కాగా వెనిజులాకు 30 దేశాల నుంచి వెయ్యి మెట్రిక్ టన్నుల సరకులు అందాయి.

# జూలై 1 నుంచి రాబోతున్న మార్పులివే.

## రైల్వేస్, గ్యాస్, ఆధార్, పాస్‌పోర్ట్‌లలో కీలక మార్పులు




**న్యూఢిల్లీ జూన్ 30( మహాప్రభ )**
కేంద్ర ప్రభుత్వం తన పాలసీలలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తుంది. ప్రభుత్వంతోపాటు రైల్వేలాంటి ప్రభుత్వ రంగ వ్యవస్థల్లో నిరంతరం మార్పులు జరుగుతుంటాయి. విధానాల్లో మార్పులతోపాటు ధరల్లోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. ఇవి ఎక్కువగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి అమలవుతాయి. ఈ నేపథ్యంలో జూలై 1 నుంచి వివిధ అంశాల్లో పాలసీల పరంగా, ధరల పరంగా రాబోతున్న కొన్ని కీలక మార్పులివి.

**ఆధార్-ఈమెయిల్ అప్‌డేట్ ఉచితం**
ఆధార్‌తో ఈ మెయిల్ అప్‌డేట్ చేసుకోవడం ఇకపై ఉచితం. ఆధార్‌తో ఈ మెయిల్ లింక్ చేసుకోవడం లేదా అప్‌డేట్ చేసుకోవడాన్ని ఉచితం చేస్తూ 'ద యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడీఏఐ)' నిర్ణయం తీసుకుంది. గతంలో దీనికి రూ.75 ఛార్జీ వసూలు చేసేవారు. ఇప్పుడు జూలై 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఉచితంగా ఈ సర్వీస్ వాడుకోవచ్చు. అయితే, కొత్త ఆధార్ యాప్ ద్వారా మాత్రమే ఇది సాధ్యం. వేరే మార్గాల్లో అప్‌డేట్ చేసుకుంటే నిర్దిష్ట రుసుము చెల్లించాల్సిందే.

**పాస్‌పోర్ట్ ధరల పెంపు**
జూలై 1 నుంచి పాస్‌పోర్ట్ ఫీజుల్ని కేంద్రం పెంచింది. 14 ఏళ్ల తర్వాత ఈ ఫీజుల ధరల్ని కేంద్రం సవరించింది. దీని ప్రకారం.. 36 పేజీల సాధారణ పాస్‌పోర్ట్‌కు గతంలో రూ.1,500 ఫీజు ఉండగా, ఇప్పుడు రూ.2,500 చెల్లించాలి. తత్కాల్ పాస్‌పోర్ట్‌కు గతంలో రూ.3,500 ధర ఉండగా, ఇప్పుడు రూ.5,000 చెల్లించాలి. ఇతర ఫీజుల్లో కూడా మార్పులు చేసింది.

**రైళ్లలో టిక్కెట్ లేకుంటే ఫీజు రెట్టింపు**
రైళ్లలో టిక్కెట్ లేకుండా చేసే ప్రయాణానికి సంబంధించి ఫీజును కూడా రైల్వే శాఖ రెట్టింపు చేసింది. టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తే ఇంతకుముందు రూ.250 ఫీజు ఉండేది. ఇప్పుడు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. రైల్వేస్ యాక్ట్ 1989లోని సెక్షన్ 137, సెక్షణ్ 138లను సవరిస్తూ తీసుకొచ్చిన జన్ విశ్వాస్ (అమెండ్‌మెంట్) యాక్ట్, 2026 ప్రకారం ఈ మార్పుచేసింది. అయితే, రైల్వేల్లో టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తే కోర్టులు విధించే శిక్షల్లో ఏ మార్పులు లేవు. అవి ఆరు నెలల వరకు జైలు శిక్ష. అలాగే, రూ.1,000 జరిమానా.

**క్రెడిట్ కార్డ్ రూల్స్‌లో మార్పు**
ఫోన్‌పే ఎస్బీఐ క్రెడిట్ కార్డు రివార్డ్స్‌కు సంబంధించి రూల్స్‌ను ఎస్బీఐ మార్చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా రిగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డుకు సంబంధించి మార్పులు చేసింది. ఈ రూల్స్ ప్రకారం.. డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో యాక్సెస్ కావాలంటే గడిచిన మూడు నెలల్లో రూ.60,000 స్పెండ్ చేసి ఉండాలి.

**చమురుపై ఆంక్షలు తొలగింపు**
పశ్చిమాసియా సంక్షోభం సందర్భంగా దేశంలో చమురు వినియోగంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఒక భారీ వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల చమురు మాత్రమే పోయాలి. అలాగే, ఇండస్ట్రియల్, కమర్షియల్ అవసరాలకు వాడే చమురుపై కూడా ఆంక్షలు విధించింది. వీటిని జూలై 1 నుంచి తొలగించనుంది.

**గ్యాస్ ధరల్లో మార్పు**
ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ, ఏటీఎఫ్ చమురు ధరల్ని కేంద్రం సవరిస్తుంది. జూలై 1న కొత్త ధరల్ని ప్రకటిస్తారు. దీనికి అనుగుణంగా కొత్త ధరలు అమలవుతాయి. కొంతకాలంగా వీటి ధరలు పెరుగుతూ వచ్చాయి. ఈసారి మాత్రం ధరల్ని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

**పెరగనున్న వాహనాల ధరలు**
జూలై 1 నుంచి అనేక వాహనాల ధరలు పెరుగుతాయి. పలు ప్యాసింజర్ వాహనాల ధరలు 1.5 శాతం పెంచుతున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. అలాగే, వాణిజ్య వాహనాల ధరల్ని 2.5 శాతం పెంచబోతున్నట్లు తెలిపింది. కియా మోటార్స్ కూడా తమ వాహనాల ధరల్ని 2 శాతం పెంచనుంది.


# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు..

## అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం..!



**న్యూఢిల్లీ జూన్ 30( మహాప్రభ )**
అమర్‌నాథ్ యాత్ర ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడే అవకాశం ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జూలై 3న ప్రారంభం కానున్న ఈ అమర్‌నాథ్ యాత్రకు భద్రతను మరింత పటిష్టం చేసింది. పాకిస్థాన్ లోని ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు తెలిపాయి.ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని, జమ్ముకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోందని ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేథ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటుచేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు కూడా అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మవద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నాయి.


# చైనా బిలియనీర్‌కు 30 ఏళ్ల జైలుశిక్ష విధించిన అమెరికా కోర్టు



**న్యూయార్క్: జూన్ 30( మహాప్రభ )**
చైనా బిలియనీర్ గువో వెంగుయి కి 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. అమెరికాలోని మన్‌హటన్ జిల్లా కోర్టు ఆయనకు ఆ శిక్షను విధించింది. జిల్లా జడ్జీ అనాలిసా టోరిస్ ఆ తీర్పును వెలువరించారు. చైనాలో ఒకప్పుడు సంపన్న వ్యక్తిగా ఉన్న గువో వెంగుయి.. కొన్నేళ్ల క్రితం అమెరికాకు పరారీ అయ్యారు. అయితే అమెరికా వేదికగా చైనా కమ్యూనిస్టు పార్టీని ఆయన విమర్శించేవారు. బిలియన్ డాలర్ల స్కామ్‌లో అమెరికా కోర్టు ఆయనకు ఇవాళ శిక్షను ఖరారు చేసింది. ప్రాపర్టీ టైకూన్‌గా పేరున్న గువో వెంగుయి.. 2017లో చైనాను వీడి అమెరికా వెళ్లారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ విమర్శకుడిగా పేరుగాంచారు. ఆన్‌లైన్‌లో భారీ సంఖ్యలో చైనీయులు ఆయన్ను ఫాలో అయ్యేవారు. అయితే మనీల్యాండరింగ్, ఫ్రాడ్, ముఠా నేరాభియోగాల కింద గువోను అరెస్టు చేశారు.చైనాకు ప్రజాస్వామ్యాన్ని మార్చాలనుకున్న ప్రజలను గువో పీక్కుతిన్నారని న్యూయార్క్ కోర్టు జడ్జీ అనాలిసా తన తీర్పులో పేర్కొన్నారు. చైనీయుల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బును దోచుకున్నగువో.. ఆ సొమ్ముతో సంపన్న జీవితాన్ని గడిపారు. చైనాలో రాజకీయ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని భారీ ఆన్‌లైన్ ఉద్యమాన్ని నడిపారు. అమెరికా చేరుకున్న తర్వాత వారి నుంచి భారీ మొత్తంలో సొమ్మును రాబట్టారు. అమెరికాలో ఉన్న చైనా కమ్యూనిటీ ప్రజల్ని నమ్మించారు. తన ఫాలోవర్ల నుంచి సుమారు బిలియన్ డాలర్ల మొత్తాన్ని సేకరించారు. 2018 నుంచి 2023 మధ్య కాలంలో ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో స్కీమ్‌లతో ప్రజల్ని గువో మోసం చేశారు. అమెరికాలో గువో 50 వేల చదరపు గజాల ఇంటిని నిర్మించుకున్నారు. మిలియన్ డాలర్లతో విలాసవంతమైన లాంబోర్గిని కారు ఖరీదు చేశారు. సుమారు 37 మిలియన్ల డాలర్లు పెట్టి ఓ నౌకను సొంతం చేసుకున్నారు. స్వంత అవసరాల కోసం డబ్బును వాడడంతో.. గువోపై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ తనకు వచ్చిన నిధులను రాజకీయాల కోసం వాడినట్లు ఆయన చెబుతున్నారు. చైనాను విమర్శించే అమెరికా నేతలతో గువో చేతులు కలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గతంలో సలహాదారుడిగా చేసిన స్టీవ్ బానన్‌తో కలిసి ఆన్‌లైన్ వీడియోలు చేశారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ఆ ఇద్దరూ కలిసి పనిచేశారు. ఓ ఫ్రాడ్ కేసులో గత ఏడాది స్టీవ్ బాననన్‌ను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. కానీ మన్‌హటన్ కోర్టులో బానన్ తన నేరాన్ని అంగీకరించారు. గువోపై మొత్తం 12 కేసులు నమోదు చేశారు. సుమారు ఏడు వారాల పాటు ప్రాసిక్యూటర్లు ఆ కేసులను విచారించారు. బోగస్ మాటలతో ప్రజల్ని మోసం చేసినట్లు న్యాయమూర్తులు తేల్చారు.

# స్కూల్ బస్సుపై కూలిన భారీ వృక్షం..

## ఒక విద్యార్థి మృతి.. నలుగురికి గాయాలు



**న్యూఢిల్లీ జూన్ 30( మహాప్రభ )**
మహారాష్ట్ర రాజధాని ముంబైలో దారుణం జరిగింది. స్కూల్ బస్సుపై ఒక పెద్ద చెట్టు కూలడంతో ఒక విద్యార్థి మరణించాడు. మరో నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన ముంబైలోని చెంబూర్‌లో మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటలకు జరిగింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. చెంబూర్, రోడ్ నెంబర్ 11లోని యూనివర్సల్ స్కూల్ నుంచి విద్యార్థులు బస్సులో ఇంటికి తిరిగి వెళ్తున్నారు.ఈ క్రమంలో స్కూల్ బస్సుపై ఒక పెద్ద చెట్టు కూలిపోయింది. ఈ సమయంలో బస్సులో ఉన్న 18 మంది విద్యార్థుల్లో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. విద్యార్థులు బస్సులో నలిగిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు అక్కడికి చేరుకుని విద్యార్థుల్ని బస్సు నుంచి బయటకు తీశారు. ఐదుగురిని ఆస్పత్రికి తరలించగా, ఒక విద్యార్థి మరణించాడు. మిగతా నలుగురికి చికిత్స కొనసాగుతోంది. ప్రమాదం అనంతరం అధికారులు ఘటనా స్థలంలో చెట్టును తొలగిస్తున్నారు. ఈ ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో ఉన్న చెట్లను తొలగించాలని బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులకు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవలే ఇలాంటి ఘటన ఇంకోటి జరిగిందని, అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇటీవలి కాలంలో ముంబైలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయి.

# జూలైలోనూ వర్షాల లోటు

-ఐఎండీ ఆందోళన
-జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం: ఐఎండీ
-ఎల్‌నినో ప్రభావంతో వర్షాలకు బ్రేక్
-125 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జూన్‌లో లోటు వర్షపాతం
-ఖరీఫ్ సాగుపై ప్రతికూల ప్రభావం.. 23 శాతం తగ్గిన పంట విస్తీర్ణం
-ఆగస్టు, సెప్టెంబర్లలో మెరుగైన వర్షాల కోసం నిరీక్షణ



దేశంలో ఇప్పటికే వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్‌లో తగినంతగా వర్షాలు కురవలేదు. జూలైలోనైనా భారీ వర్షాలు కురుస్తాయని ఆశిస్తున్న వారికి షాకిచ్చే ప్రకటన చేసింది భారత వాతావరణ సంస్థ ఐఎండీ. జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ప్రకటించింది. పసిఫిక్ భూమధ్య రేఖ వద్ద ఎల్‌నినో బలపడటం వల్ల ఈ పరిస్థితి ఉంటుందని ఐఎండీ తెలిపింది. ఇప్పటికే జూన్‌లో 39 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. 1901 తర్వాత ఈ స్థాయిలో జూన్‌లో లోటు వర్షపాతం నమోదు కావడం ఇది ఐదోసారి. అంటే 125 ఏళ్లలో ఇంత తక్కువ వర్షపాతం నమోదైన ఐదు జూన్‌లలో ఇదీ ఒకటి. ఐఎండీ తాజా అంచనా ప్రకారం జూలైలో దేశంలోని అనేక ప్రాంతాల్లో తక్కువ వర్షపాతమే నమోదవుతుంది. సెంట్రల్ ఇండియా, ఉత్తర భారత, తూర్పు భారత్ ప్రాంతాల్లో లోటువర్షపాతమే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం భారీ వర్షపాతమే నమోదయ్యే ఛాన్స్ ఉంది. వాయువ్య, తూర్పు-మధ్య, తూర్పు ప్రాంతాల్లో సాధారణం నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. దేశంలో లోటు వర్షపాతం ఉండటంతో వ్యవసాయ రంగంలో అనిశ్చితి నెలకొంది. గత ఏడాదితో పోలిస్తే ఖరీఫ్ సాగు 23 శాతం తగ్గినట్లు కేంద్రం అంచనా వేస్తోంది. వర్షాలు కురవకపోవడంతో వరి, పప్పుధాన్యాలు, సోయాబీన్, పత్తి వంటి పంటలు ఎక్కువగా నాట్లు వేయలేదు. వర్షాకాలంలో నాలుగు నెలల్లో జూన్, జూలైలలో తక్కువ వర్షపాతమే నమోదవుతుంది. అయితే, ఆ తర్వాత నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ఆగస్టు, సెప్టెంబర్‌లలో మెరుగైన వర్షపాతం నమోదు కావొచ్చని ఆస్ట్రేలియాకు చెందిన వాతావరణ సంస్థ బ్యూరో ఆఫ్ మెటియోరాలజీ (బీఓఎం) తెలిపింది. కానీ, జూలైలో నమోదయ్యే వర్షపాతమే దేశంలో భారీ వర్షాలకు కారణమవుతుంది. వర్షాల లోటును తీరుస్తుంది. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నా.. సాధారణ వర్షపాతమే నమోదవుతోంది.

## నేటి నుంచి భారత్‌లో
# జపాన్ ప్రధాని పర్యటన

మొదటి తరువాయి

తకైచి కూడా ఇండియాలో పర్యటించనుండటం కూడా ఇదే మొదటిసారి. ఈ మూడు రోజుల పర్యటన సందర్భంగా తకైచి.. ప్రధాని మోదీతో ఉన్నతస్థాయి చర్చలు జరిపి, ఇరు దేశాల మధ్య సహకారం, సమన్వయంపై ఒప్పందం కుదుర్చుకుంటారు. అనంతరం మోదీతో కలిసి ఇండియా-జపాన్ దేశాల సంయుక్త ఆర్థిక సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్, జపాన్‌లకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారు. రెండు దేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడుల అంశంపై చర్చిస్తారు. ఇండియా-జపాన్ మధ్య కొంతకాలంగా సంబంధాలు మెరుగుపడుతున్నాయి. ముఖ్యంగా 2014 నుంచి ఇరు దేశాలు ప్రపంచ వ్యూహాత్మక భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ జపాన్‌లో పర్యటించారు. రాబోయే దశాబ్దకాలంపాటు ఇరు దేశాలు ఎలా కలిసి పని చేయాలనే అంశంపై అవగాహనకు వచ్చారు. రక్షణ, భద్రతతోపాటు పెట్టుబడులు, వాణిజ్యం, సాంకేతికత, పౌర సంబంధాల విషయంలో చర్చలు జరిపారు. జపాన్ ప్రధాని తకైచి ప్రవేశపెట్టిన స్వేచ్ఛాయుత, ఇండో పసిఫిక్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో ఇండియా కీలక భాగస్వామి అని జపాన్ భావిస్తుంది. సెమీ కండక్టర్లు, క్రిటికల్ మినరల్స్ సరఫరా విషయంలో కూడా ఒప్పందం కుదరనుంది. అలాగే, సముద్ర తీర రక్షణ, భద్రత విషయంలో కూడా రెండు దేశాలు కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు భారతీయ నిపుణుల్ని భారీ ఎత్తున జపాన్‌కు పంపించేందుకు కూడా ఒప్పందం కుదరవచ్చు.

## సింధు జలాలపై
# పాక్ బెదిరింపులు

మొదటి తరువాయి

రద్దు చేయడం తగదంటూ చెప్పుకొచ్చాడు. సింధు నదికి సంబంధించిన జలాల విషయంలో ఇండియా, పాక్ మధ్య దశాబ్దాలుగా ఒప్పందం ఉంది. అయితే, గత ఏడాది పహల్గాంలో ఉగ్రదాడుల తర్వాత ఈ ఒప్పందాన్ని ఇండియా రద్దు చేసింది. దీంతో పాకిస్తాన్‌కు సింధు నదీ జలాల పంపిణీని భారత్ నిలిపివేసింది. మిగులు జలాల్ని కూడా ఇండియానే వాడుకుంటోంది. దీనిపై పాక్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నా, అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావిస్తూ ఉన్నా భారత్ మాత్రం వెనుకడుగు వేయడం లేదు. సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం గురించి గత ఏడాది మోదీ మాట్లాడారు. తీవ్రవాదం, చర్చలు రెండూ ఒకేసారి ఉండవు అంటూ చెప్పారు. అలాగే, రక్తం, నీరు కలిసి పారలేవు అంటూ పేర్కొన్నారు. ఈ విషయంలో ఇండియా తన వైఖరి మార్చుకోబోదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇటీవల స్పష్టం చేశారు. భారత నిర్ణయం వల్ల పాకిస్తాన్ తీవ్రంగా నష్టపోతోంది. అక్కడి సుక్కుర్ బ్యారేజ్ దాదాపుగా ఎండిపోయింది. ఈ బ్యారేజ్ పాకిస్తాన్లోని సింధు నదిపై ఉంది. ఈ నదికి నీళ్లు ఇండియా నుంచే వెళ్తాయి. కానీ, ఇండియా నీళ్లను ఆపేయడంతో అక్కడ నది ఎండిపోయి కనిపిస్తోంది. ఈ నది నుంచి బలూచిస్తాన్లోని లక్షలాది వ్యవసాయ భూములకు నీరు అందేది. ఇప్పుడు ఆ భూములన్నీ బీడుబారుతున్నాయి. పాకిస్తాన్ సింధు నది నుంచి ఏర్పడ్డ కాలువల్లో కూడా నీటి ప్రవాహం తగ్గిపోయింది

# పాక్‌లో మేం భాగం కాదు..

మొదటి తరువాయి

కశ్మీర్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)పై నిషేధం విధించడంతో ఆ సంస్థ ఆధ్వర్యంలో పీవోకేలోని రావల్‌కోట్ ఈద్గా గ్రౌండ్‌లో నిరసనకారులు తమ ఆందోళనను కొనసాగించారు. 'పీవోకేలోని రావల్‌కోట్, మీర్‌పూర్ నివాసితులు అసలైన కశ్మీరీలు కాదు' అంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల ప్రకటించడంపై వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా రేషన్, అత్యవసరాల సరఫరాలో ప్రభుత్వం కల్పిస్తున్న ఆటంకాల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌరులను పాకిస్థాన్ ప్రభుత్వ మూకుమ్మడిగా శిక్షిస్తున్నదని వారు ఆరోపించారు. 'మాకు మీ రేషన్ అక్కర్లేదు. మీకు మా సహాయం కావాలి' అనీ పీవోకే నేత సర్దార్ ఆమన్ ఖాన్ పేర్కొన్నారు. తమ సరుకుల సరఫరా నిలిపివేత ఇంకా కొనసాగిస్తే పౌరులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సి ఉంటుందని ఆయన పాక్ ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు.

# రైతు సంక్షేమంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

మొదటి తరువాయి

నుంచి రైతు భరోసా నిధులకు సంబంధించిన రూ.2,482 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి మీట నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. తద్వారా రెండెకరాల వరకు ఉన్న 41.37 లక్ష?ల మంది రైతులకు లబ్ది చేకూరుతుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడారు. రైతులు ఆత్మగౌరవంతో బతికేలా పరిపాలన సాగిస్తున్నామన్నారు. హైదరాబాద్ రాష్ట్రం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బూర్గుల రామకృష్ణారావు నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు 19 మంది దాకా ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పాలించినా కేవలం రూ.69 వేల కోట్లు మాత్రమే అప్పు చేశారనీ, మిగులు రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణను పదేండ్ల కేసీఆర్ హయాంలో రూ.8.11 లక్ష?ల కోట్లు అప్పులు చేసి ఊబిలోకి నెట్టేసి వెళ్లారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు కూడా వాయిదాల పద్ధతిలో ఇస్తున్నారని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అందుకే తొలి క్యాబినెట్ సమావేశంలోనే రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అప్పు... ప్రత్యక్ష?ంగా, పరోక్ష?ంగా కార్పొరేషన్లు, శాఖలు, ఇతరత్రా రూపాల్లో తెచ్చిన అప్పులేంటో తేల్చాలని డిప్యూటీని సీఎం భట్టి విక్రమార్కను కోరితే తవ్వినకొద్దీ అప్పుల కుప్పలు బయటపడ్డాయని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు అందేలా చూడాలని సీఎస్‌ను ఆదేశించానన్నారు. బడిపిల్లల బట్టలు, మధ్యాహ్నభోజన కార్మికులకు, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం వేలకోట్లు బకాయిలు పెట్టిపోయిందని వివరించారు. మిగులుతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం



కేసీఆర్ పాలనలో బికారిగా మారిందని విమర్శించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు తీసుకెళు_న్నామని చెప్పారు.

ఉచిత కరెంటూ.. రుణమాఫీ పేటెంట్ మాదే

'ప్రజాప్రభుత్వం 30 నెలల పాలనలో రూ.20,677 కోట్లతో రైతులకు రూ.2 లక్ష?ల రుణమాఫీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.7 వేల కోట్ల రైతు బంధు బకాయిలను పెండింగ్‌లో పెడితే క్లియర్ చేశాం. రైతు భరోసాను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచాం. గత ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ వద్ద రైతులకు ధాన్యం డబ్బులు బకాయి పెట్టి పోతే వాటిని క్లియర్ చేశాం' అని చెప్పారు. రైతు భరోసా కోసం ఇప్పటికే రూ.27 వేల కోట్లు ఖర్చుపెట్టామనీ, ఇప్పుడు మరో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేయబోతున్నామన్నారు. ఈ ఒక్క పథకానికే ఇప్పటివరకు రూ.36 వేల కోట్లు ఖర్చుచేశామని వివరించారు. ఉచిత కరెంటు, రుణమాఫీ పథకాలకు పేటెంట్ కాంగ్రెస్‌పార్టీనే అని చెప్పారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖ ద్వారా రూ.1.68 లక్ష?ల కోట్ల వడ్లను కొంటే...30 నెలల కాలంలోనే ప్రజా ప్రభుత్వం రూ.80 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. ఃఇప్పటిదాకా రూ. 1.75 లక్ష?ల కోట్లను రైతుల కోసం ఖర్చుపెట్టామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నెలా రైతుల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, తాము రూ.6వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. లక్ష? కోట్ల రూపాయలు పెట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందన్నారు. మూడేండ్ల నుంచి కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా రాష్ట్రంలో 2.88 లక్ష?ల మెట్రిక్ టన్నుల వడ్లను పండించిన ఘనత తెలంగాణ రైతాంగానికి దక్కుతుందని కొనియాడారు. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పిల్ల రాక్ష?సులు కాశీమజిలీ కథలతో మళ్లీ తప్పుడు ప్రచారాలు చేస్తే నమ్మే స్థితిలో జనం లేరని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, కోటి ఎకరాలకు సాగు నీరు వంటి హామీలను ప్రస్తావించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు బాధ్యతలు

మొదటి తరువాయి

మధ్యప్రదేశ్‌కు చెందిన తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, కేంద్ర సర్వీసుల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మెకానికల్ ఇంజినీరింగ్?లో ఎంటెక్, ఎంబీఏ ఫైనాన్స్ పూర్తి చేశారు. క్షేత్రస్థాయి పోస్టులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాలనాపరమైన ఉన్నత హోదాల్లో పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. ఈ గవర్నెన్స్, పరిపాలనలో డిజిటల్ వినియోగంపై సంజయ్ జాజుకు పట్టుంది. 'మీ సేవ'ను అందుబాటులోకి తీసుకురావటంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు 2014 నుంచి 2018 వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత ఐదేండ్లపాటు రక్షణ శాఖలో జాయింట్ సెక్రెటరీ, అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. రెండేండ్ల నుంచి ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన ఇటీవలే తెలంగాణ కేడర్‌కు తిరిగి వచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్‌గా, కీలకమైన ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు సీఎంవోలో ఏర్పాటు చేసిన స్పీడ్ విభాగం సీఈవోగా, ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ప్రత్యేక సీఎస్‌గా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

# ఆశీర్వాద సభల పేరిట సీఎం రేవంత్ నాటకాలు

మొదటి తరువాయి

మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొన్నటిదాకా పంట కొనుగోళ్ల సంక్షోభం ఇప్పుడు యూరియా కష్టాలు మరోవైపు కమ్ముకు వస్తున్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర రైతన్నలు తీవ్రమైన కష్టాల్లో ఉన్నారని తెలిపారు. ఎగవేతల రేవంత్ రెడ్డి ఇప్పుడు సంబరాలు చేసుకుంటున్న తీరును చూసి రాష్ట్ర రైతన్నలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 30 నెలల పాలన 'ముదనష్టపు పాలన'అని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయాన్ని దండగలా మార్చి రైతుల గొంతు కోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్న గ్యారెంటీలతో గారడీ చేసి అధికారంలోకి వచ్చాక ఒకటి, రెండు ఎకరాలకే అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని తెలిపారు. దాదాపు 70 లక్షల మంది రైతుల ఉసురు పోసుకుంటున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి రైతన్నలకు చేస్తున్న ద్రోహాన్ని రైతులు మర్చిపోతారనుకోవడం అవివేకమేనని హెచ్చరించారు. రూ. 50 వేల కోట్లతో పూర్తి చేయాల్సిన రూ.రెండు లక్షల రుణమాఫీని కనీసం పావలా వంతు కూడా చేయకుండా అన్నదాతలను రేవంత్ సర్కార్ మోసం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 72 సార్లు చేసిన ఢిల్లీ టూర్లకు, పనికిరాని సభలకు పెడుతున్న రూ.కోట్లాది ఖర్చును ఆదా చేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేదని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా దొరక్క అల్లాడుతున్నారని కేటీఆర్ తెలిపారు. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నదని తెలిపారు. పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకోవడం వారి చేతకానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం పండగలా సాగిందని గుర్తుచేశారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, సుమారు రూ.73 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో కేసీఆర్ ఎప్పటికీ 'రైతు బాంధవుడి'గా నిలిచిపోతారని తెలిపారు. కానీ రైతులకు వెన్నుపోటు పొడిచిన రేవంత్ రెడ్డి మాత్రం 'రైతు ద్రోహి'గానే మిగిలిపోతారని పేర్కొన్నారు.

# ఆర్మీ నూతన చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్



న్యూఢిల్లీ

ఆర్మీ స్టాఫ్ నూతన చీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాయుధ దళాలలో 40 ఏళ్లకు పైగా కెరీర్ కలిగిన జనరల్ సేథ్ పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో విజయ వంతంగా నిర్వహించిన రెండు ఆపరేషనల్ ఆర్మీ కమాండ్‌లకు నాయకత్వం వహించారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో సేథ్ బాధ్యతలు స్వీకరించారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది మంగళవారమే పదవీ విరమణ చేశారు. కాగా, జనరల్ సేథ్ ఖడక్‌వాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి. డిసెంబర్ 1986లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో నియమితు లవ్వడంతో భారత సైన్యంలో ప్రవేశించారు. ఈ నలభై ఏళ్లలో అనేక హోదాల్లో పనిచేశారు. ఆర్మీ కమాండర్‌తో పాటు జైపూర్‌లోని సౌత్ వెస్టర్న్ కమాండ్, సదరన్ కమాండ్‌లకు జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా పనిచేశారు. ఈ సమయంలోనే పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో రెండు ఆపరేషనల్ కమాండ్‌లకు నాయకత్వం వహించిన అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. తరువాత 31వ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ (సిఓఎఎస్), వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేశారు.

## ఫడ్నవిస్‌ను కలిసిన
# పవన్ కళ్యాణ్

మొదటి తరువాయి



ఈ సందర్భంగా పెద్దమనసుతో సహకారం అందిస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కు పవన్ కళ్యాణ్ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం వల్ల తూర్పు కనుమల్లో జన్యు వైవిధ్యం పెరిగి, దీర్ఘకాలిక స్థిరత్వంతో కూడిన ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి గల పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుందని పవన్ కళ్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వన్యప్రాణి సంరక్షణలో తమకు నిరంతరం మార్గదర్శకత్వం వహిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు కూడా ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాస్త్రీయ విధానాలతో జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయని, భవిష్యత్తులోనూ కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు సాగుతామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు

# జులై 2న క్యాబినెట్ భేటీ

మొదటి తరువాయి

సమయానికి పంపాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులందరూ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని ఉత్తర్వులో ఆదేశించారు.

## సంపాదకీయం

# 'యాప్' కుట్ర!




సాంకేతికత వినియోగం ప్రతిరంగంలోనూ అవసరమే. దీనిద్వారా ప్రభుత్వ సేవల్లో పారదర్శకత పెంచడం, అక్రమాలను అరికట్టడం, సబ్సిడీ ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చూడడం మంచిదే. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు సౌలభ్యాన్ని కల్పించినప్పుడే దాని అసలు ప్రయోజనం నెరవేరుతుంది. కానీ ఆ పేరుతో మొత్తం వ్యవస్థనే నాశనం చేయాలని చూస్తే పెద్దలకు లాభం తప్ప పేదలకు మేలు జరగదు. దానికి ఉదాహరణే యూరియా యాప్. యూరియా పంపిణీలో అమలు చేస్తున్న టెక్నాలజీ (యాప్ ఆధారిత విధానం) కూడా రైతులకు సౌలభ్యం కంటే ఇబ్బందులనే మరింత తెచ్చిపెడుతోంది. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు ఈ విధానం నిద్రపట్టనీయడం లేదు. ఈ యాప్ వెనుక కుట్ర ఉందని అనుమానాలు రోజురోజుకూ బలపడుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం మాత్రం పాత వాదననే పునరుద్ఘాటిస్తోంది. అక్రమాలను అరికట్టేందుకే ఈ విధానమని చెబుతోంది. మరి అలాంటప్పుడు రైతులు ఎందుకు ఇబ్బందులు పడుతున్నారన్నదానికి సమాధానం లేదు. యూరియా పక్కదారి పడుతున్నదని, నిజమైన రైతులకు సబ్సిడీ అందడం లేదంటూ రాష్ట్రప్రభుత్వం తెచ్చిన 'ఫ్రేమ్ వర్క్ ఆఫ్ ఫర్టిలైజర్ సేల్' విధానం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగమూ లేదు. ఈ యాప్ ద్వారా రైతుల పాసు పుస్తకాల్లో నమోదైన భూముల ఆధారంగా అవసరమైన ఎరువులను బుకింగ్ చేసుకోవాలి. కేంద్రం రాయితీ ఇస్తున్న యూరియా, ఇతర ఎరువులను ఈ యాప్‌లో నమోదు చేయాలి. ఆ తర్వాత రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. దీన్ని చూపి నిర్దేశించిన మొత్తంలో కేటాయించిన ఎరువులను ప్రయివేటు దుకా ణాల్లో కొనుగోలు చేయాలి. యాప్ తీర్చిద్దినంత సులువుగా ఎరువుల కేటాయింపు లేదు. బుకింగ్ సమయంలో ఆ మండలంలో ఏ డీలర్ వద్ద యూరియా ఉంటే అక్కడే రైతులకు రెండు బస్తాల యూరియాను కేటాయిస్తారు. ఎకరా ఉన్న రైతులకు ఒకేసారి, ఎకరం నుంచి ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు విడతల వారీగా ఎకరాకు రెండు బస్తాలు చొప్పున యూరియాను అందిస్తారు. యాప్‌లో ఒకసారి రెండు బస్తాలు మాత్రమే కేటాయింపు చేసుకోవాలి. ఐదు నుంచి పది ఎకరాల వరకు సాగుచేసే రైతులు అయిదు నుంచి పదిసార్లు బుక్ చేసుకోవాలి. ఈ విధానం చూస్తే సాధారణ రైతు వ్యవసాయం మానేసి, ఎరువుల బస్తాలు ఎప్పుడొస్తాయన్నది దుకాణం ముందు కూర్చొని ఎదురు చూడాలి. వాస్తవానికి ఎకరా ఉన్న రైతుకు రెండు బస్తాలు కేటాయించినా వాటిని తెచ్చుకోవా లంటే 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో వెళ్లి తెచ్చుకోవాలి. ఐదు, పదెకరాలు ఉన్న రైతులు రెండు బస్తాలు చొప్పున అన్నిసార్లు బుక్ చేసుకోవడానికి పడరాని పాట్లు పడాల్సిందే. పాసు పుస్తకాలున్న రైతులకే యూరియా కేటాయింపు అంటే చాలామంది రైతులకు పాసు పుస్తకాలు లేవు. అందులోనూ తప్పులు ఉంటే యాప్ తీసుకోదు. యాప్ ఓపెన్ కావాలంటే మంచి మొబైల్ ఉండాలి. దానికి తగట్టు యాప్‌ను ఓపెన్ చేసే పరిజ్ఞానం ఉండాలి. వాటిని అసలైన రైతు ఏమి అందుకుంటాడు. భూస్వాములు, పలుకుబడి ఉన్న ధనిక రైతులు తిరగకుండానే యూరియా ఇంటికి వచ్చేస్తుంది. అంటే, ఈ యాప్ పెద్దోళ్లకు మేలు చేస్తుందా? పేదలకా అన్నది ఇట్టే తెలిసిపోతోంది. అదేవిధంగా డిస్ట్రిబ్యూటర్‌లకు కేటాయించే నలభై శాతం యూరియా ఆయా జిల్లాల రైతులకే కేటాయిం చాలన్న నిబంధన లేదు. వందలాది ఎరువుల బస్తాలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నా పట్టించుకునే నాథుడు లేదు. ఫలితంగా యూరియా కొరత నెలకొని ఆందోళనలకు దారితీస్తోంది. యాప్ బాగుందని, నిజమైన రైతుల కు ఎరువులు అందుతాయని ప్రభుత్వం నమ్మబలికింది. గత ఖరీఫ్‌లోనే కొన్నిచోట్ల యాప్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గతంలోనే రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయలేదు. ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కేంద్రం సూచనలతో యాప్ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయడం దుర్మార్గమైన చర్య. వ్యవసాయానికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులు లేవని ఇప్పటికే రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు ఎరువు కోసం సహకార సంఘానికి, ఎరువుల దుకాణానికి వెళితే వ్యవసాయం చేసేదెప్పుడు? అలాగే, ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నది కౌలు రైతులు. వారి అవసరాలు, సౌకర్యాలు గుర్తించకుండా రూపొందించిన విధానం సమగ్ర వ్యవసాయ విధానం ఎలా అవుతుంది? నేడు తెలంగాణలో కౌలురైతుల సంఖ్య బాగా పెరిగింది. సాగు చేస్తున్నది ఒకరు, భూయజమాని మరొకరు. కానీ యాప్ భూ యజమాని వివరాల ఆధా రంగానే వ్యవహరించడం వల్ల కౌలు రైతులు ఎరువులందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా అక్రమ మళ్లింపు, బ్లాక్ మార్కెట్, సబ్సిడీ దుర్వినియోగం వంటి సమస్యలను నియంత్రించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. యాప్ మాటున ఎరువుల వాడకాన్ని తగ్గించాలని చూస్తే రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. యాప్‌ను వెంటనే రద్దు చేసి రైతులకు సులువైన మార్గంలో ఎరువులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే యాప్ కుట్రకు రైతులు బలయ్యే ప్రమాదముంది.

# క్షయ వ్యాధిని నివారించవచ్చు

### ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, జూన్ 30( మహాప్రభ )**
క్షయ వ్యాధి నివారణకు మందులు ఉన్నాయని, క్షయ వ్యాధి సోకినవారు బాధపడాల్సిన అవసరం లేదని, క్రమం తప్పకుండ మందులు వాడితే క్షయ వ్యాధి నయమవుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పంచగామ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "క్షయ వ్యాధి (టిబి) అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు వారాలకు పైగా తగ్గని దగ్గు,రాత్రి పూట జ్వరం రావడం, బరువు తగ్గడం,ఆకలి మందగించడం వంటివి టిబి వ్యాధి ప్రధాన లక్షణాలనన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఉచిత వైద్యం, పోషకాహారం,ప్రభుత్వ ఆసుపత్రులలో టిబి వ్యాధికి నిర్ధారణ పరీక్షలతో పాటు పూర్తి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లభించే ఆర్థిక సహాయం, పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిబి వ్యాధి వచ్చిన వారు అధైర్యపడాల్సిన అవసరం లేదని, డాక్టర్ల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా కోర్సు పూర్తి అయ్యేంత వరకు మందులు వాడితే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు అన్నారు. టిబి బాధితుల పట్ల వివక్ష చూపకుండా,వారిని ఆదరించి సకాలంలో వైద్యం అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, యువత,వైద్య సిబ్బంది కలిసి గ్రామాన్ని "టిబి రహిత గ్రామం"గా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల విఠల్ రెడ్డి,వెంకట్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య అధికారులు, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### క్రిటికల్ కేర్ ఆసుపత్రిపై
# ఏఐవైఎఫ్ నిరసన




**కరీంనగర్, జూన్ 30( మహాప్రభ )**
కరీంనగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ భవనం పేరుకే ఉందని, అత్యవసర వైద్య సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావండ్లపల్లి యుగంధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ముందు ఏఐవైఎఫ్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. యుగంధర్ మాట్లాడుతూ ఎమ్ఆర్ఐ, సిటిస్కాన్, డిజిటల్ ఎక్స్‌రే వంటి విభాగాలకు అనుభవజ్ఞులైన సిబ్బందిని నియమించాలని, అత్యవసర వైద్యానికి తగిన పరికరాలు, వైద్య బృందం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోగులకు అత్యవసరమైతే వరంగల్ ఎంజీఎమ్ లేదా హైదరాబాద్ ఎయిమ్స్, నిమ్స్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టర్ అరాచకాలు, శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలను కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగించడం వల్ల సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందని ఆరోపించారు. అవసరమైతే కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కాన్ సెంటర్, ఆర్వో వాటర్ ప్లాంట్, ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలని, ఉచిత డెడ్ బాడీ వాహనాలు, కొత్త ఫ్రీజర్లు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. ఆసుపత్రిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని యుగంధర్ కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో నగర కార్యదర్శి చెంచల మురళి, మాడిశెట్టి అరవింద్, ఆడెపు శ్రీనివాస్, రాజు, నరహరి ప్రేమలత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండ్



**కరీంనగర్, జూన్ 30( మహాప్రభ )**
జిల్లా ఐరన్ అండ్ హార్డ్‌వేర్ హమాలి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలోని అన్ని రంగాల హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని గంజ్‌లో హమాలి కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తక్కువ కూలి ఇచ్చి ఇతర రాష్ట్రాల కార్మికులకు పని కల్పించడం వల్ల స్థానిక హమాలి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, లారీలు దించేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నందున వారికి ప్రమాద బీమా, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో హమాలి కార్మికుల సమస్యలపై తీర్మానం చేసి, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆగయ్య, ఉపాధ్యక్షుడు చింతనిప్పుల సాయిలు, కార్మికులు పెంచాల సంపత్, కొమ్మ వెంకటేశ్, జక్కుల రాములు, కూకట్ల సంపత్, కొట్టే సంపత్, శీలం మధునయ్య, తాని శ్రీనివాస్, బండారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు డిస్కం నిర్ణయంపై ధర్నా





**కరీంనగర్, జూన్ 30( మహాప్రభ )**
టీజీ ఆర్ పీడీసీల్ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించాలంటూ సిఐటియు, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయు ఆధ్వర్యంలో కరీంనగర్ విద్యుత్ సర్కిల్ ఆఫీస్ వద్ద ధర్నా జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ, కొత్త రైతు డిస్కం ఏర్పాటు ప్రైవేటీకరణకు దారి తీస్తుందని, క్రాస్ సబ్సిడీ రద్దై గృహ వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం పడుతుందని పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టం 2025లోని నిబంధనలతో ప్రిపెయిడ్ మీటర్లు, అధిక చార్జీలు విధించే అవకాశం ఉందని అన్నారు. ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ఈ నిర్ణయం రైతాంగం, చిన్న వ్యాపారులు, పరిశ్రమలు, కార్మికులు, సాధారణ వినియోగదారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. రూ.45 వేల కోట్ల అప్పుల్లో రూ.35 వేల కోట్లు కొత్త డిస్కంకు బదిలీ చేయడం ఉచిత కరెంటు, నీటి సరఫరా వ్యవస్థలకు ఆటంకం కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్ద నాలా పూడిక తొలగింపు , దోమల నివారణ చర్యలు



**కరీంనగర్, జూన్ 30( మహాప్రభ )**
గణేష్ నగర్ 57వ డివిజన్ పరిధిలోని బైపాస్ రోడ్డులో స్వాతి చికెన్ సెంటర్ నుండి హైదరాబాద్ మెయిన్ రోడ్ వరకు ఉన్న పెద్ద నాలా చెత్త, చెదారంతో నిండిపోవడంతో దుర్వాసన వ్యాపించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్ తక్షణ చర్యలు తీసుకుని వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా పెద్ద నాలా పూడిక తొలగింపు పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా దోమల నివారణకు కెమికల్ పొగ మస్కిటో ఫాగింగ్ నిర్వహించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీశైలం దేవస్థానానికి వెండి నాగాభరణం సమర్పణ

**శ్రీశైలం, జూన్ 30( మహాప్రభ )**
రంగారెడ్డి జిల్లా నాదర్గుల్‌కు చెందిన పి. రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి అయిదు శిరస్సులతో కూడిన వెండి నాగాభరణం, వెండి చెంబును శ్రీశైలం దేవస్థానానికి సమర్పించారు. ఈ ఆభరణం, చెంబు కలిపి మొత్తం బరువు 416 గ్రాములు. ఆలయ ఆశీర్వచన మండపంలో దాతలు ఈ సమర్పణను ఆలయ పర్యవేక్షకులు గంజి రవి, ఉపప్రధానార్చకులు బి. వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జున, గుమాస్తా సావిత్రిలకు అందజేశారు. అనంతరం వారికి తగు రశీదు అందజేసి, వేదాశీర్వచనంతో స్వామి అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఉస్మాన్ కుంటలో ఘనంగా శ్రీ ఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం



**దేవరకొండ డివిజన్ జూన్ 30 ( మహాప్రభ )**
చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామ పంచాయతీ పరిధిలో నూతన నిర్మించిన ఆలయ శ్రీ అంజనేయ స్వామి ధ్వజ స్తంభం ప్రతిష్టాపన జూలై 1/7/2026 నుండి3/7/2026 మహోత్సవ కార్యక్రమం విచ్చేయాలని బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ కమిటీ ఫౌండర్ టెస్ట్ సభ్యుడు లోటావత్ బీమా నాయక్ తెలిపారు. బీమా నాయక్ మాట్లాడుతూ శ్రీ ఆంజనేయస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవం మూడు రోజులు జరుగుతుందని అన్నదానం కూడా అక్కడ ఉంటుందని ప్రజలు అధిక సంఖ్యలో రావాలని ఆయన కోరారు. ఫౌండర్ టెస్ట్ నెంబర్లు అరుణ్ అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో ఉస్మాన్ కుంట గ్రామస్థులు కేతవత్ రమేష్, గుడి పూజారి లోటవత్ దాస్రు ,కేతావాత్ బూర పకీర బిచ్చ చందర్ వరుణ్ రాథోడ్ తావూరియా తదితరులు పాల్గొన్నారు

# మెదక్ మున్సిపల్ పరిధిలోని సమస్యలపై స్పందిస్తాం.

**-మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధికా భూపతి యాదవ్.**



**మెదక్ జిల్లా - 30జూన్ (మహాప్రభ ).**
మెదక్ పట్టణంలోని పలు సమస్యల పరిష్కార దిశగా ముందుకు వెళ్తామని మెదక్ మున్సిపల్ చైర్పర్సన్ కానుగు రాధిక భూపతి యాదవ్ పేర్కొన్నారు.మంగళవారం మెదక్ పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పట్టణంలోని పలు సమస్యలపై కౌన్సిలర్లతో, అధికారులతో పాటు చర్చించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పార్టీలకు అతీతంగా సమస్యలను పరిష్కరించడంలో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా పలు వార్డులలో అధికంగా సమస్యలు ఉన్న వాటి పై దృష్టి సాధిస్తామని అన్నారు. దాంతోపాటు ప్రతిపక్షంలో ఆరోపిస్తున్నట్లు అభివృద్ధి నిధులపై ఎలాంటి జాప్యం చేయడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నవీన్, మునిసిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రైతు సేవ సహకార సంఘం వారోత్సవాల్లో పాల్గొన్న డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి




**దేవరకొండ జూన్ 30( మహాప్రభ )**
కొండమల్లేపల్లి రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన "5 పంచవర్షాల సమృద్ధికి సహకార వారోత్సవాలు" కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్. చైర్మన్, టి.పి.సి.సి. సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతుల అభివృద్ధికి బలమైన వేదికలని, రైతులకు అవసరమైన సేవలు, రుణాలు, వ్యవసాయ ప్రోత్సాహకాలను సమర్థవంతంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సహకార వ్యవస్థ మరింత బలోపేతం కావడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపరు. ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్. డైరెక్టర్లు, సభ్యులు, రైతులు, సహకార సంఘం ప్రతినిధులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ 10,500 కోట్లను తక్షణమే విడుదల చేయాలి



**దేవరకొండ జూన్ 30( మహాప్రభ )**
సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి 100,500 కోట్ల స్కాలర్షిప్ ,ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఆర్డీవో కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించారు ఆర్డీవో పి పద్మప్రియ కు వినతిపత్రం అందజేశారుఈ సందర్భంగా సామాజిక వేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ ను స్కాలర్షిప్ 10,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని దీనివల్ల పేద విద్యార్థుల అయినటువంటి బీసీ ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు విద్యను దూరమైనటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం విద్యార్థుల పట్ల వివక్షత, మొండివైఖరి ప్రదర్శిస్తుంది. జీవో నెంబర్ 8, 9 తక్షణమే రద్దు చేసి పాత విధానంలో ఫీజు రీఎంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేసి పేద విద్యార్థులకు చదువుకునే విధంగా ప్రోత్సహిస్తూ చేయూత నివ్వాలని కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేసి పేద విద్యార్థులకు కావలసినటువంటి పెండింగ్ బకాయిలు ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని సాధించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు ,భీమగోనీ శివ గౌడ్, మునగాల గణేష్, దోమకొండ హరి, లౌడియా బాషా నాయక్ ,వసుకుల కృష్ణ యాదవ్, బొమ్మ శ్రీనివాస్ యాదవ్, జెల్లా వెంకట గౌడ్, గణేష్, విద్యార్థులు, కళాశాల యజమాన్యాలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా -30జూన్ (మహాప్రభ )**
ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, అందులో భాగంగానే ఇటీవల విత్తనమేళాలు నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుందని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం హైదరాబాదు నుంచి ప్రతి రైతుకు ఎకరానికి రూ.12000 పంట పెట్టుబడి సాయంను వారి ఖాతాల్లో జమ చేసే రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని నర్సాపూర్ మండలం లింగాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతు భరోసా విడుదల వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, డివిజన్ స్థాయి అధికారి, మండల స్థాయి అధికారి , ఏఈవోలు తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ రైతులతో కలిసి టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, పలు శాఖల ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి రైతు భరోసా కార్యక్రమంలో తమ ప్రసంగాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఈ వేదికగా రైతులకు ఎల్నినో ప్రభావం, పంటల మార్పిడి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలు,ఆయిల్ ఫాం పంటల నిర్వహణ, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులను పిపిటి ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఏ డి ఏ సంధ్య, ఏవో దీపిక, టెక్నికల్ శ్రీదేవి, వ్యవసాయ విస్తరణ అధికారి గ్రామ సర్పంచ్ ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు, రైతులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 71 మందిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని కౌన్సెలింగ్..

**-12 ఈ-పెట్టీ కేసులు నమోదు.**
**-జిల్లా వ్యాప్తంగా 42 అవగాహన కార్యక్రమాలు నిర్వహణ**
**-వేధింపులకు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించండి.**
**-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్..**



**మెదక్ జిల్లా -30జూన్ (మహాప్రభ )**
మహిళలు, బాలికల భద్రతకు మెదక్ జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తన, సైబర్ వేధింపులపై షీ టీం నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. షీ టీం జూన్ నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యల్లో 71 మందిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘించిన 12 మందిపై ఈ-పెట్టీ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.అలాగే మహిళలు, బాలికల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా 42 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మహిళల భద్రత, అత్యవసర సేవలు, షీ టీం సేవలు, సైబర్ నేరాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా వెంటనే షీ టీం లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, బాధితులకు తక్షణ సహాయం అందించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.
మహిళల భద్రత కోసం ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, వేధింపుల సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

## మందారం యాదయ్య విగ్రహాని ఆవిష్కరించి దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.





**దేవరకొండ డివిజన్ జూన్ 30 ( మహాప్రభ )**
చింతపల్లి మండలం గొడుకొండ్ల (మాల్) గ్రామానికి చెందిన మందారం యాదయ్య విగ్రహాని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... యాదయ్య మృతి పార్టీకి తీరని లోటు అని ఆయన అన్నారు. యాదయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది అని ఆయన అన్నారు. నిరంజన్ గౌడ్, జిట్ట జగదీష్, గ్యార పోచయ్య,ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

# అంకితభావంతో, క్రమశిక్షణతో, నిజాయితీ సేవలకు నిలువుటద్దం ప్రకాష్ రావు.

**-జిల్లా పరిశ్రమల అధికారిగా ఆ శాఖకు వన్నెతెచ్చిన వ్యక్తి.**
**-జిల్లా పరిశ్రమల అధికారిగా పదవి విరమణ పొందుతున్న రాయల ప్రకాష్ రావు సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమ సింగ్.**



**మెదక్ జిల్లా -30జూన్ (మహాప్రభ )**
అంకిత భావంతో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లా పరిశ్రమల శాఖకు వన్నెతెచ్చిన వ్యక్తిగా ఆయన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అన్నారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో 30 సంవత్సరాల సుదీర్ఘకాలం పనిచేసి జిల్లా పరిశ్రమల అధికారిగా పదవీ విరమణ పొందుతున్న రాయల ప్రకాష్ రావు సన్మాన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది జీవితంలో ఒక గొప్ప ఘట్టం. వారి సుదీర్ఘమైన శ్రమను, అనుభవాన్ని గుర్తించి అభినందించడానికి కొన్ని అద్భుతమైన వేదికగా నిలుస్తుంది అన్నారు ప్రభుత్వ సేవలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా ఉద్యోగి పాత్ర ఎంతో విలువైనదని, పదవీ విరమణ పొందిన జిల్లా పరిశ్రమల అధికారి తమ విధి నిర్వహణలో నిష్కళంకమైన సేవలు, కర్తవ్యనిష్ఠ, మానవీయ విలువలను చాటుతూ పరిశ్రమల శాఖ ప్రతిష్ఠను పెంపొందించారని ప్రశంసించారు. ఉద్యోగ జీవితం ముగిసినా సమాజానికి వారి అనుభవం, సేవా భావం మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు
అనంతరం బంధువులు, జిల్లా పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, స్నేహితులు, పూల బొకే శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ భాగంగా ఎనిమినేషన్ పత్రాల పంపిణీ



**దేవరకొండ డివిజన్ జూన్ 30 ( మహాప్రభ**
డి శీ డి మండలం శాంతిగూడెం గ్రామపంచాయతీ లో ఎమర్జెన్సీ పత్రాలు బి ఎల్ ఓ జున్ను జయమ్మ పంపిణీ చేశారు.
పరిశీలించిన వారు ఈ కార్యక్రమాన్ని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జున్ను జయమ్మ డీఎల్ఓ కోళ్ల పిచ్చయ్య గ్రామ వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# అక్కన్నపేటలో మద్యపాన నిషేధం

**-- గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం**

**-అమ్మితే రూ.10 వేలు, కొంటే రూ.5 వేలు జరిమానా**







**రామాయంపేట, జూన్ 30, (మహాప్రభ)**
రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తూ గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సోమవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

**తీర్మానం :** గ్రామ పంచాయతీ వద్ద జరిగిన సమావేశంలో గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ.10,000, కొనుగోలు చేస్తే రూ.5,000 జరిమానా విధించాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు.

**మహిళల ఆవేదన:** గ్రామంలో మద్యం, కల్తీ కల్లు కారణంగా యువత, పెద్దలు ప్రాణాలు కోల్పోతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మద్యానికి బానిసలై పనులకు వెళ్లలేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వాపోయారు. కల్తీ కల్లు తాగి మత్తులో ద్విచక్ర వాహనాలపై వెళ్తూ తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయని తెలిపారు.

**దామరచెరువులోనూ కల్తీ కల్లు:** అక్కన్నపేటతో పాటు పక్కనే ఉన్న దామరచెరువు గ్రామంలోనూ పెద్ద ఎత్తున కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ, సీఐ, ఎస్ఐలు వెంటనే స్పందించి కల్తీ కల్లు డిపోలపై దాడులు చేసి అరికట్టాలని డిమాండ్ చేశారు.

**హెచ్చరిక:** అధికారులు చర్యలు తీసుకోకపోతే మహిళా సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన చేస్తామని గ్రామ మహిళలు హెచ్చరించారు.

# ఏడుపాయల పర్యాటకానికి చేయూత ..

**-మెదక్ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం ..**



**పాపన్నపేట,జూన్30( మహా ప్రభ )**
మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయ పర్యాటకాభివృద్ధి కొరకు ఏకో ఫ్రెండ్లీ 12 కాటేజీల నిర్మాణానికి రూ. 7 కోట్లు మైనంపల్లి రోహిత్ రావు చోరవతో.. టూరిజం శాఖ టిజి టిడిసి ద్వారా సోమవారం మంజూరు చేయడం జరిగింది. మంగళవారం పాపన్నపేట మండల సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచులు కార్యకర్తలు ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయం వద్ద మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధి కొరకు కృషి చేసిన ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ పాపన్నపేట మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్..నాయకులు ప్రభాకర్ రెడ్డి,శ్రీకాంత్,సర్పంచులు..విజయదుర్గా నాని,సుశీల దుర్గన్న,శ్రీధర్, నాగరాజు, సిద్దప్ప,శ్రీశైలంఅప్ప, హీరాలాల్,శీను, అంజనేయులు,రాజశేఖర్,ప్రభాకర్,మల్లప్ప,రమేష్,భూమన్న వెంకటేశ్వర రెడ్డి,ఖలీమ్,సంగమేష్,ప్రవీణ్ శివన్న తదితరులు పాల్గొన్నారు.

# జెండా ఊపి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే




**నారాయణఖేడ్ జూన్ 30( మహాప్రభ )**
హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంగళవారం రైతు భరోసా నిధులు విడుదల చేయనున్న కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గం నుండి రైతులు తరలివెళుతున్న బస్సును ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని,అందులో భాగమే రైతు భరోసా నిధుల విడుదల అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని రైతులందరికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నూతన్ కుమార్,వ్యవసాయ శాఖ అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, రైతులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు చేయాలని రైతులతో కలిసి ధర్నా

**-అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్‌ను వీడేది లేదు.**

**-మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి.**



**మెదక్ జిల్లా -30జూన్ (మహాప్రభ ).**
జొన్నలు పండించిన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని,అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్‌ను వీడబోమని, ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టి రైతుల తరపున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి హెచ్చరించారు.మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని దంతేపల్లి, కాట్రియల, పర్వతాపూర్, కిషన్ తండా, జామ్లా తండా గ్రామాలకు చెందిన రైతులు జొన్నల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి రైతులతో కలసి ధర్నా నిర్వహించి సంఘీభావం ప్రకటించారు. జొన్నలను కొనుగోలు చేసిన అనంతరం మట్టి పేల్లలు ఉన్నాయనే కారణంతో మార్క్‌ఫెడ్ అధికారులు తిరిగి వెనక్కి పంపడాన్ని నిరసిస్తూ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఎంతో కష్టపడి పండించిన జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన జొన్నలను నాణ్యత పేరుతో, మట్టి పేల్లలు ఉన్నాయనే సాకుతో తిరిగి రైతులకే అప్పగించడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలియజేసినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులు జొన్నలను తిరిగి పంపిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జొన్నల కొనుగోలుపై అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తూ రైతుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ...ఈ ఏడాది జొన్న పంట సాగు చేసిన రైతులు మార్కెట్‌లో సరైన ధర లేక, ప్రభుత్వ కొనుగోళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మట్టి పేల్లలు ఉన్నాయనే కారణంతో జొన్నలను తిరస్కరించడం సమంజసం కాదన్నారు. గతంలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే విధంగా జొన్నలను కూడా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.జొన్నల కొనుగోలులో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.అనంతరం మార్క్‌ఫెడ్ డీఎం, బాలకృష్ణ డిఆర్ఓ అంబదాస్ జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ అరేళ్ళ.మల్లికార్జున్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్.కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు చౌదరి. సుప్రభాత రావు,రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ చౌదరి చరిత, బిఆర్ఎస్, నాయకులు ఎస్కే అహ్మద్. ఉమామహేశ్వర్, శ్యామ్,స్మోకింగ్, నవీన్,దోమకొండ శ్రీను,అస్సుద్దిన్, విజయ భాస్కర్ రెడ్డి సత్యపాల్, కిషన్ బాబు సంతోష్ శ్రవణ్ గౌడ్ మహేష్ శ్రీకాంత్, నర్సింగరావు, మెదక్ పట్టణ నాయకులు లింగారెడ్డి ప్రభు రెడ్డి,మోచి. కిషన్, ఇందాద్,సాయి,కిరణ్,ఎంబీపూర్ మహేష్,స్వామి నాయక్,వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# 'కపాస్ కాంతి' మిషన్‌తో పత్తి సాగులో విప్లవాత్మక మార్పులు

- **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
- **ఆమనగల్లు, మాడుగులలో 742 ఎకరాల్లో అమలు..**
- **రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే**




**ఆమనగల్లు, జూన్ 30( మహాప్రభ )**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో వానాకాలం--2026లో అమలు చేస్తున్న 'పత్తి ఉత్పాదకత పెంపు (కపాస్ కాంతి) మిషన్' పథకం ద్వారా ఆమనగల్లు, మాడుగుల మండలాల్లో 742 ఎకరాల్లో పత్తి సాగును లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన రైతులకు రాశి, ప్రవర్ధన్ కంపెనీల సబ్సిడీ పత్తి విత్తనాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పత్తి సాగులో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడం, రైతుల దిగుబడులు, ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ పథకంలో భాగంగా రైతులకు అధిక సాంద్రత పత్తి సాగు, దగ్గర దగ్గరగా నాటే విధానం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ విధానాలను అనుసరించడం వల్ల సాగు వ్యయం తగ్గి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. రైతులకు సబ్సిడీ పత్తి విత్తనాలతో పాటు సేంద్రియ సస్యరక్షణ మందులు, సాంకేతిక మార్గదర్శకాలు కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మాడుగుల మండలం రాందుగ్గెల గ్రామానికి చెందిన రైతు ఈదుల కృష్ణయ్య పొలంలో న్యూమాటిక్ ప్లాంటర్ ద్వారా సబ్సిడీ పత్తి విత్తనాల విత్తన ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ, సహాయ వ్యవసాయ సంచాలకులు శోభారాణి, వ్యవసాయ అధికారులు అరుణకుమారి, శ్రీనివాస్ గౌడ్, ఏఈఓలు రాజేష్, ప్రియాంక, భార్గవి, జ్యోత్స్న, గురుప్రసాద్, సుజాత, ప్రభావతి, నికితా, మాడుగుల సర్పంచ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

# ఉర్కొండలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు



**కల్వకుర్తి, జూన్ 30( మహాప్రభ )**
జూలైలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉర్కొండ మండలంలోని ప్రసిద్ధ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ఆలయ పరిసరాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం ఉర్కొండపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని సందర్శించి, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. హెలికాప్టర్ ల్యాండింగ్, కాన్వాయ్ రాకపోకలు, అత్యవసర సేవల ఏర్పాట్లపై సమగ్ర సూచనలు చేశారు.మండలంలో ప్రతిపాదించిన ఇంటిగ్రేటెడ్ మండల స్థాయి కార్యాలయాలు, నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ స్థలాలను కూడా పరిశీలించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా మౌలిక వసతులతో ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.ఉర్కొండ రైతు వేదికలో జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి పర్యటన జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైనది. ప్రతి శాఖ అధికారి పూర్తి బాధ్యతతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలి" అని అన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, తాగునీటి వసతులు, ఆరోగ్య రక్షణ, వ్యవసాయ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక సూచనలు చేశారు.కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ యూసుఫ్ అలీ, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**- ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన వసతులు కల్పించాలని సీపీఎం డిమాండ్**



**ఆమనగల్లు, జూన్ 30( మహాప్రభ )**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆమనగల్ పట్టణంలోని భవాని గార్డెన్‌లో తలకొండపల్లి, ఆమనగల్, మాడుగుల, కడ్తాల్ మండలాల ముఖ్య నాయకుల సమావేశం కామ్రేడ్ పి.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందుకూరు జగన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా సామగ్రి, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను మెరుగుపరచాలని, పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని, పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కానుగుల వెంకటయ్య, గుమ్మడి కురుమయ్య, శివగల్ల రమేష్, గోరేటి నరసింహ, గంజి యాదగిరి, పల్లేటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## భారత మార్కెట్లోకి కొత్తగా N6 స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసిన వన్‌ప్లస్.. ధర ఎంతంటే..!

భారత మార్కెట్లోకి వన్‌ప్లస్ కొత్త చీ6 స్మార్ట్‌ఫోన్ ను విడుదల చేసింది. నార్డ్ సిరీస్‌కు దిగువ స్థాయిలో తీసుకొచ్చిన తొలి 'చీ' సిరీస్ ఫోన్ ఇదే. భారీ బ్యాటరీ, 120HZ డిస్‌ప్లే, తాజా ఆండ్రాయిడ్ వెర్షన్‌తో ఈ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. వన్‌ప్లస్ N6 ప్రారంభ ధర రూ.22,999గా నిర్ణయించింది. ఇందులో 4జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ లభిస్తుంది. 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.24,999 గా డిసైడ్ చేశారు.అమెజాన్ ప్రైమ్ డే సందర్భంగా రూ.1,000 ప్రత్యేక తగ్గింపుతోపాటు యాక్సిస్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులపై మరో రూ.2,000 తక్షణ డిస్కౌంట్ అందిస్తోంది. ఆరు నెలల వరకు నో-కాస్ట్ ఈఎంఐ సౌకర్యం కూడా ఉంది. జూలై 4 నుంచి అమెజాన్‌లో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఫోన్‌లో 6.75 అంగుళాల హెచ్‌డీ ఎల్‌సీడీ డిస్‌ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేట్‌తోపాటు గరిష్ఠంగా 1,200 నిట్స్ బ్రైట్‌నెస్‌ను అందిస్తుంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆక్సిజన్ ఓఎస్ 16తో ఫోన్ వస్తోంది. రెండు ప్రధాన ఆండ్రాయిడ్ అప్‌డేట్లు, మూడు సంవత్సరాల సెక్యూరిటీ అప్‌డేట్లు ఇస్తామని కంపెనీ ప్రకటించింది. ఫోన్‌లో మీడియాటెక్ డైమెన్సిటీ 6360 అపెక్స్ ప్రాసెసర్‌ను అమర్చారు. వేడి తగ్గించేందుకు పెద్ద వేపర్ చాంబర్ కూలింగ్ వ్యవస్థను కూడా అమర్చింది. ఫొటోగ్రఫీ కోసం వెనుకవైపు 50 మెగాపిక్సెల్ కెమెరా ఇచ్చారు. ముందు భాగంలో 8 మెగాపిక్సెల్ సెల్ఫీ కెమెరా ఉంది. 1080 పిక్సెల్స్ రిజల్యూషన్‌లో 60 ఎఫ్‌పీఎస్ వరకు వీడియోలు రికార్డ్ చేయవచ్చు. డ్యూయల్ వ్యూ వీడియో మోడ్ కూడా ఈ కొత్త ఫోన్‌లో అందుబాటులో ఉంది. ఈ ఫోన్‌లోని 8,000ఎంఏహెచ్ బ్యాటరీ ప్రధాన ఆకర్షణ. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే మూడు రోజుల వరకు బ్యాటరీ నిలుస్తుందని కంపెనీ పేర్కొన్నది. 45 వాట్ల ఫాస్ట్ ఛార్జింగ్‌తోపాటు 6.5 వాట్ల రివర్స్ వైర్డ్ ఛార్జింగ్‌కు కూడా మద్దతు ఉంది. ఐపీ65 వాటర్, డస్ట్ రెసిస్టెన్స్‌తోపాటు మిలిటరీ గ్రేడ్ డ్యూరబిలిటీ సర్టిఫికేషన్‌ను కూడా పొందింది.



## నష్టాల్లో ముగిసిన భారత స్టాక్ మార్కెట్..

- సెన్సెక్స్ 250 పాయింట్లు పతనం



భారత స్టాక్ మార్కెట్ మంగళవారం నష్టాల్లో ముగిసింది. మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగియడం వరుసగా ఇది రెండోసారి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 249 పాయింట్లు, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 80 పాయింట్లు నష్టపోయాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ ఉదయం 77,005.51 వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఒక దశలో 77,037.36 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్‌ఈ సెన్సెక్స్ 249.70 పాయింట్లు (0.30) నష్టపోయి 76,478.67 వద్ద నిలిచింది.ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ50 80.50 పాయింట్లు (0.34%) నష్టపోయి 23,865.75 వద్ద ముగిసింది. ఐటీ స్టాక్స్ ఒత్తిడికి గురికావడం, అమెరికాకు చెందిన ఎకనామిక్ డాటా, ఫెడరల్ రిజర్వ్ ఇంటరెస్ట్ రేట్, ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ సూచీలో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హిందుస్థాన్ లీవర్ షేర్లు భారీగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, టైటాన్, మారుతి సుజుకి సంస్థల షేర్లు లాభపడ్డాయి. వీటిలో మారుతి సుజుకి షేర్లు ఏకంగా 5 శాతం లాభపడ్డాయి. నిఫ్టీలో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 73.25 డాలర్లుగా ఉంది. మరోవైపు రూపాయి విలువ స్వల్పంగా క్షీణించింది. డాలర్‌తో రూపాయి విలువ 94.66 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,025.73 డాలర్లుగా ఉంది.

## భారీగా బంగారం ధరలు పతనం.. 18 ఏళ్లలో తొలిసారి!

బంగారం ధరలు భారీగా పడిపోతున్నాయి. జూన్ నెలలో బంగారం ధర 13% పడిపోయింది. 2008 అక్టోబర్ తర్వాత, అంటే గత 18 ఏళ్లలో ఒకే నెలలో ఇంత భారీగా తగ్గడం ఇదే తొలిసారి. వరుసగా గత నాలుగు నెలలుగా బంగారం ధరలు తగ్గుతూనే వస్తున్నాయి. జనవరిలో గరిష్ట స్థాయి నుంచి చూస్తే దాదాపు 30% పడిపోయింది. ఈ నేపథ్యంలో బంగారం కొనడానికి ఇదే సరైన సమయం అని చాలామంది భావిస్తున్నారు. అయితే, ఒకేసారి భారీగా కొనుగోలు చేయడం కంటే, సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



# స్పోర్ట్స్

## బంగ్లాదేశ్‌ను పడగొట్టిన పేస్ త్రయం..

### టెస్టుల్లో జింబాబ్వేకు భారీ విజయం..!



సుదీర్ఘ ఫార్మాట్‌లో జింబాబ్వే సంచలన విజయంతో అదరగొట్టింది. స్వదేశంలో జరిగిన ఏకైక టెస్టులో బంగ్లాదేశ్ పై భారీ విజయంతో రికార్డు నెలకొల్పింది. తమను తక్కువ అంచనా వేస్తే భంగపాటు తప్పదని చాటుతూ ఇన్నింగ్స్ 85 పరుగుల తేడా బంగ్లాను చిత్తు చేసింది. పేస్ త్రయం బ్లెస్సింగ్ ముజరబని(4-65), రిచర్డ్ నగరవ(3-32), న్యూమన్ న్యాంహూరి(2-28)లు నిప్పులు చెరగగా పర్యాటక జట్టు బ్యాటర్లు క్రీజులో నిలిచేందుకు అష్టకష్టాలు పడ్డారు. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(34) పోరాడినా సరిపోలేదు. ఫలితంగా మూడో రోజు రెండో సెషన్‌లోనే మ్యాచ్ ముగిసింది.ఇటీవల టెస్టు క్రికెట్‌లో పాకిస్థాన్, వెస్టిండీస్‌పై చరిత్రాత్మక విజయాలతో జింబాబ్వే పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్‌కు పెద్ద షాక్ తగిలింది. చిన్న జట్టే కదా అని తేలికగా తీసుకున్నందుకు భారీ మూల్యం చెల్లిస్తూ ఇన్నింగ్స్ 85 పరుగుల తేడాతో నజ్ముల్ హుసేన్ శాంటో సేన కంగుతిన్నది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూమన్(4-61), ముజరబని(2-19)ల ధాటికి 140కే పరిమితమైన బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది.ఫాలో ఆన్ ఆడిన పర్యాటక జట్టు మూడో రోజు 40/1తో ఆట మొదలెట్టింది. కానీ, బంగ్లాను బ్లెస్సింగ్ ముజరబని(4-65), రిచర్డ్ నగరవ(3-32)లు వికెట్ల వేటతో బంగ్లాను కోలుకోలేని దెబ్బతీశారు. సహచరులు విఫలమైనా.. సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ రహీం(34) కాసేపు నిలబడ్డాడు. కానీ, రిచర్డ్, ముజరబని ద్వయం ధాటికి టెయిలెండర్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. 185 రన్స్‌కే ఆలౌటైన పర్యాటక జట్టు ఇన్నింగ్స్ 85 పరుగుల ఓటమి మూటగట్టుకుంది. ఇదివరకూ అఫ్గనిస్థాన్‌ను సైతం ఇన్నింగ్స్ 75 పరుగుల తేడాతో ఓడించింది జింబాబ్వే.

**కియా శతకంతో..**

తొలి ఇన్నింగ్స్‌లోనే బంగ్లాదేశ్‌ను వణికించిన జింబాబ్వే మ్యాచ్‌పై పట్టు బిగించింది. 36 వద్ద ఓపెనర్లను కోల్పోయిన బంగ్లాను మొమినుల్ హక్(60) అర్ధ శతకంతో ఆదుకున్నాడు. కానీ, న్యూమన్ న్యాంహూరి(4-61), ముజరబని(2-19)లు మిడిలార్డర్‌ను పడగొట్టారు. వీరి జోరుకు టెయిలెండర్లు పెవిలియన్‌కు క్యూ కట్టగా. 140కే బంగ్లా కుప్పకూలింది. అనంతరం.. ఓపెనర్ ఇన్నోసెంట్ కియా(140) భారీ శతకంతో చెలరేగగా.. క్రెగ్ ఇర్విన్ 60 పరుగులతో మెరిశాడు. తైజుల్ ఇస్లాం(7-138) రాణించగా ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ 410 వద్ద ముగిసింది.

## ఏకపక్ష పోరులో చిత్తైన వెస్టిండీస్.. ఎనిమిదోసారి ఫైనల్లో ఆస్ట్రేలియా..!

మహిళల టీ20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఏకపక్ష పోరులో వెస్టిండీస్ పై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ బేత్ మూనీ(61 నాటౌట్) దూకుడుగా ఆడింది. రెండు వికెట్లు పడినా.. అర్ధశతకంతో కదం తొక్కిన మూనీ.. అషే గార్డ్‌నర్(35 నాటౌట్)తో కలిసి విండీస్ బౌలర్లను సమర్ధంగా ఎదుర్కొంది. నాలుగోసారి సెమీస్‌లో విండీస్‌ను ఓడించిన కంగారూ టీమ్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఫైనల్లో అడుగుపెట్టింది.ఐసీసీ నాకౌట్స్‌లో తిరుగులేని ఆస్ట్రేలియా మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌ను వణికించిన ఆసీస్.. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించింది. 2012లో 2014లో, 2018లో కరీబియన్ టీమ్‌ను సెమీస్‌లోనే ఇంటికి పంపిన కంగారూలు ఈసారి కూడా పైచేయి సాధించారు. 126 పరగులు ఛేదనలో ఓపెనర్ జార్జియా వోల్(16), ఫొబే లిచ్‌ఫీల్డ్(4)లు త్వరగానే ఔటైనా.. బేత్ మూనీ(61 నాటౌట్) నిలబడింది.క్లాక్సటన్ వేసిన 6వ ఓవర్లో నాలుగు ఫోర్లతో మూనీ రెచ్చిపోవడంతో.. ఆసీస్ పవర్ ప్లేలో రెండు వికెట్ల నష్టానికి 63 రన్స్ కొట్టింది. అష్ గార్డ్‌నర్(35 నాటౌట్) మరో ఎండ్‌లో యాంకర్ రోల్ పోషించగా మూనీ మైదానం నలువైపులా షాట్లతో అలరించి స్కోర్ బోర్డును ఉరికించింది. 29 బంతుల్లోనే అర్ధ శతకం సాధించిన తను.. గార్డ్‌నర్‌తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. వీరిద్దరూ క్రీజులో పాతుకుపోవడంతో ఆసీస్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.




**ఓపెనర్ల తడబాటు**


భారీ స్కోర్ కొట్టాలనుకున్న వెస్టిండీస్‌కు ఆస్ట్రేలియా బౌలర్లు షాకిచ్చారు. టాస్ ఓడి ఇన్నింగ్స్ దూకుడుగా ఆరంభించినా హేలీ మాథ్యూస్(30)ను ఆసీస్ స్పిన్నర్లు సమర్ధంగా నిలువరించారు. నాలుగో ఓవర్లో కిమ్ గార్త్, ఐదో ఓవర్లో లూయిస్ హామిల్టన్ ఒక్కో పరుగే ఇచ్చారు. మరో ఎండ్‌లో క్వియానా జోసెఫ్(16).. తడబాటుతో పవర్ ప్లేలో విండీస్ 35 రన్స్ చేసింది. ఆసీస్ బౌలర్లు వరేహం(2-17) తొలి బంతికే మాథ్యూస్(30)ను బౌల్డ్ చేసింది. 47 వద్ద తొలి వికెట్ పడగా.. క్రీజులోకి వస్తూనే షెమైనే క్యాంప్‌బెల్(22) రెండు ఫోర్లు బాదింది. కానీ, తర్వాత మొలినెక్స్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన జోసెఫ్ నేరుగా సథర్‌లాండ్ చేతికి చిక్కింది.

**గార్డ్‌నర్ డబుల్..**

ఓపెనర్లు వెనుదిరిగిన షాక్ నుంచి తేరుకోక ముందే గార్డ్‌నర్ విండీస్‌ను మరింత ఒత్తిడికి గురి చేసింది. 11వ ఓవర్లో డేంజరస్ స్టెఫానీ టేలర్(0), క్లాక్స్టన్(0)ల వికెట్లు తీసి మరింత కష్టాల్లోకి నెట్టింది. ఆ దశలో చినొల్లే హెన్రీ(10) జతగా క్యాంప్‌బెల్ జట్టును ఆదుకోవాలనుకుంది. అయితే.. ఈ ఇద్దరూ త్వరగానే ఔటవ్వడంతో.. విండీస్ వందలోపే పరిమితమయ్యేలా కనిపించింది. ఆఖర్లో డియాంద్ర డాటిన్(22 నాటౌట్) మెరుపులతో స్కోర్ దాటించింది. దాంతో, నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి కరీబియన్ టీమ్ 125 రన్స్ చేయగలిగింది.


## ముంబైని వీడిన పాండ్యా..

బెంగళూరుకు మారడానికి కారణమిదే..!



భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబైని వీడాడు. ఈమధ్య తరచూ గాయాలతో సతమతమవుతున్న పాండ్యా ఫిట్‌నెస్ కోసం బెంగళూరుకు మకాం మార్చాడు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న ఈ డాషింగ్ బ్యాటర్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను తన శాశ్వత శిక్షణ కేంద్రంగా మార్చుకున్నాడు. తద్వారా ప్రస్తుతం బీసీసీఐ కాంట్రాక్టున్న వారిలో.. సీఓఈలో తప్పనిసరిగా ట్రైనింగ్ తీసుకోనున్న తొలి ఆటగాడు పాండ్యానే కావడం విశేషం.గుజరాత్‌లోని బరోడాకు చెందిన హార్దిక్ పాండ్యా గత పదేళ్లుగా ముంబైలో ఉంటున్నాడు. ఐపీఎల్ జట్టు ముంబై ఇండియన్స్‌కు ఆడుతున్న పాండ్యా.. ఫ్రాంచైజీ శిక్షణ కేంద్ర ఘన్సోలీ లో గడిపేవాడు. కానీ, 19వ సీజన్ అనంతరం అతడిని వట్రేడ్ డీల్ ద్వారా వదులుకోవాలని ముంబై యాజమాన్యం పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో తిరిగి భారత జట్టులో చోటే లక్ష్యంగా పెట్టుకున్న పాండ్యా ముంబై నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యాడు.వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న ఈ ఆల్‌రౌండర్ ఫిట్‌నెస్ మెరుగుపరచుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై బీసీసీఐ వర్గాలు స్పందించాయి. 'హార్దిక్ పాండ్యా ఇదివరకే బెంగళూరుకు షిఫ్టయ్యాడు. సిటీ శివారులో.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు దగ్గర్లో ఒక భవంతిని అద్దెకు తీసుకున్నాడు. సీఓఈని శాశ్వత శిక్షణ కేంద్రంగా మలచుకున్న ఏకైక ఆటగాడు పాండ్యానే. ముంబైలోని ఇంటి నుంచి శిక్షణ కేంద్రానికి వెళ్లడం పాండ్యాకు ఇబ్బందిగా తోచింది. సెంట్రల్ కాంట్రాక్టున్న ఆటగాడు కాబట్టి అతడు సీఓఈలో ప్రతి సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు' అని పీటీఐతో వెల్లడించాయి.

# పవన్ కళ్యాణ్ ‘ఓజీ 2’లో బుట్టబొమ్మనా?
## ..ఇక అమ్మడి దశ తిరిగినట్టే..!




టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేకు మరో భారీ అవకాశం దక్కిందనే వార్తలు సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. గత కొంతకాలంగా సరైన విజయాలు లేక టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గిన ఈ స్టార్ హీరోయిన్, ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే ఛాన్స్ కొట్టేసిందని ఫిలింనగర్‌లో ప్రచారం జరుగుతోంది.తాజా సమాచారం ప్రకారం, పవన్ కళ్యాణ్ -- దర్శకుడు సుజిత్ కాంబినేషన్‌లో రూపొందనున్న ‘ఓజీ 2’ కోసం పూజా హెగ్డే పేరును పరిశీలిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ‘ఓజీ’కి కొనసాగింపుగా తెరకెక్కనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో ఆమెను హీరోయిన్‌గా తీసుకునే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు .ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. పవన్ కళ్యాణ్, పూజా హెగ్డే కాంబినేషన్ గతంలోనే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రానికి తొలుత పూజా హెగ్డే పేరే వినిపించింది. కానీ డేట్స్ సమస్యలు, ఇతర కారణాల వల్ల ఆ కాంబినేషన్ కార్యరూపం దాల్చలేదు. దీంతో అభిమానులు ఈ జోడీని తెరపై చూడాలనే ఆశతోనే మిగిలిపోయారు.ఇప్పుడు ‘ఓజీ 2’లో నిజంగానే పూజా హెగ్డేకు అవకాశం లభిస్తే, అది ఆమె కెరీర్‌కు కీలక మలుపుగా మారే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల వరుస పరాజయాలతో టాలీవుడ్‌లో ఆమె జోరు కొంత తగ్గినా, పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న పవన్ కళ్యాణ్ సినిమా ఆమెకు బలమైన కమ్‌బ్యాక్‌ను ఇవ్వొచ్చని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ‘ఓజీ’ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సీక్వెల్‌కు సంబంధించిన ప్రతి చిన్న వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యంగా హీరోయిన్ ఎంపికపై జరుగుతున్న ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. అయితే ప్రస్తుతం పూజా హెగ్డే ‘ఓజీ 2’లో నటిస్తున్నారన్న వార్తలు అధికారికంగా ధృవీకరించబడలేదు. చిత్రబృందం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ఈ వార్తలను ప్రచారంగా మాత్రమే పరిగణించాల్సి ఉంటుంది.



## బ్లాక్ డ్రెస్‌లో మైండ్ బ్లాక్ చేస్తున్న కాజల్..


# ‘రాకా’లో విలన్‌గా రష్మిక...

### లగడపాటి శ్రీధర్ వ్యాఖ్యలతో మళ్లీ హాట్‌టాపిక్‌గా అల్లు అర్జున్-అట్లీ సినిమా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం ‘రాకా’ పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇటీవలే ఈ చిత్ర టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించగా, ఇప్పుడు హీరోయిన్ రష్మిక మందన్న పాత్రకు సంబంధించిన ప్రచారం మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మొదటి నుంచే ‘రాకా’ సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతోందని, ఇందులో రష్మిక మందన్న పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె క్రూరమైన రక్తపిశాచి (వాంపైర్) తరహా నెగిటివ్ పాత్ర పోషిస్తున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.ఈ నేపథ్యంలో ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీధర్ చేసిన వ్యాఖ్యలు మరింత హాట్ టాపిక్‌గా మారాయి. రష్మిక పాత్రపై తనకు పూర్తి సమాచారం లేదని చెబుతూనే, ఒకవేళ ప్రచారంలో ఉన్నట్లుగా ఆమె డార్క్ షేడ్స్ ఉన్న ప్రతినాయక పాత్రలో నటిస్తుంటే అది ఆమె కెరీర్‌లోనే అతిపెద్ద ఛాలెంజ్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.రష్మిక పాత్ర గురించి నాకు పూర్తి అవగాహన లేదు. కానీ ఆమె నిజంగానే ఇలాంటి నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేస్తుంటే, అది నటిగా ఆమెకు కొత్త మైలురాయిగా నిలుస్తుంది. ఇప్పటివరకు ప్రేక్షకులు ఆమెను గ్లామరస్, ఎమోషనల్ పాత్రల్లో ఎక్కువగా ఆదరించారు. ఈసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపిస్తే ఆమె ఇమేజ్‌కు కొత్త కోణం జతకానుంది. దర్శకుడు అట్లీ ఆ పాత్రను ఎలా డిజైన్ చేశారో చూడాలి అని లగడపాటి శ్రీధర్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో ‘రాకా’లో రష్మిక పాత్రపై వస్తున్న ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. అయితే మేకర్స్ మాత్రం ఇప్పటివరకు ఆమె పాత్రకు సంబంధించిన ఎలాంటి అధికారిక వివరాలను వెల్లడించలేదు. ఇక ఈ సినిమా మరో ప్రత్యేకత ఏమిటంటే.. ‘పుష్ప’ ఫ్రాంచైజీలో శ్రీవల్లి, పుష్పరాజ్‌గా ప్రేక్షకులను అలరించిన అల్లు అర్జున్, రష్మిక మందన్న ఈసారి పూర్తిగా భిన్నమైన స్క్రీన్ డైనమిక్స్‌తో కనిపించనున్నారనే ప్రచారం. ప్రేమికులుగా ఆకట్టుకున్న ఈ జంట, ఒకవేళ ‘రాకా’లో ఒకరిపై ఒకరు తలపడే పాత్రల్లో కనిపిస్తే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్వరలోనే మేకర్స్ పాత్రలు, కథకు సంబంధించిన మరిన్ని అధికారిక అప్‌డేట్స్ ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# వేద విద్యార్థి పార్వతి



‘ఇందులో నా పాత్ర పేరు ‘పార్వతి’. కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా వెళ్లే వ్యక్తిత్వం ఆమెది. వేద విద్యార్థిగా కనిపిస్తా. ఈ పాత్ర కోసం రెడీ అవ్వడానికి రెండు గంటలు పట్టేది. కథలో కీలకమైన పాత్ర. పార్వతి తీసుకొనే ప్రతి నిర్ణయం కథపై ప్రభావం చూపుతుంది. అరుదుగా దొరికే పాత్ర ఇది’ అని తెలిపింది నటి నభా నటేష్. ఆమె కథానాయికగా నటించిన చిత్రం ‘నాగబంధం -- ది సీక్రెట్ ట్రెజర్’. విరాట్‌కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో కిశోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక అడ్వెంచర్ థ్రిల్లర్ జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నభానటేష్ విలేకరులతో మాట్లాడింది. ‘అభిషేక్‌నామా క్లియర్ విజన్‌తో ఈ సినిమా తీశారు. కాస్ట్యూమ్స్, హెయిర్‌స్టైల్.. ఇలా చిన్న చిన్న విషయాల్లోనూ శ్రద్ధ తీసుకున్నారు.ప్రీ ప్రొడక్షన్ వర్క్ పక్కాగా చేసుకున్నారు. ఈ సినిమా కోసం నిర్మించిన అనంతపద్మనాభస్వామి ఆలయం సెట్ అద్భుతం. నిజంగా నిజమైన ఆలయాన్నే తలపించింది. 5వేల మంది డాన్సర్స్‌తో గణేష్ ఆచార్య మాస్టర్ నేతృత్వంలో నాపై చిత్రీకరించిన ‘నమోరే..’ సాంగ్ విజువల్ ఫీస్ట్‌గా ఉంటుంది. అంతపెద్ద కాన్వాస్‌పై పాట చిత్రీకరించడం ఒక ఛాలెంజ్’ అని పేర్కొన్నది నభా నటేష్. ఈ సినిమా కోసం దాదాపుగా పది సెట్లు నిర్మించారని, ప్రతి సెట్ ఒకదానికొకటి భిన్నంగా ఉంటుందని, కంటెంట్‌పై ఉన్న నమ్మకంతో రూ.110 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈచిత్రాన్ని నిర్మించారని, ప్రమోషన్స్ కూడా వినూత్నంగా చేశారని, అనంతపద్మనాభస్వామి రథయాత్ర కాన్సెప్ట్ జనాన్ని ఆకట్టుకున్నదని నభా నటేష్ చెప్పారు. విరాట్‌కర్ణ డెడికేషన్ ఉన్న నటుడని, కష్టపడి నటించాడని, తనకు ఈ సినిమాతో మంచి పేరొస్తుందని, సౌందర్‌రాజన్ సినిమాటోగ్రఫీ, వీఎఫ్ఎక్స్ వర్క్ రియల్‌గా అనిపిస్తాయని నభానటేష్ పేర్కొన్నది.

# మళ్లీ పాత రూట్లోకి అల్లరి నరేష్..

### పుట్టినరోజు కానుకగా ‘రంభ ఊర్వశి మేనక’ ఫస్ట్ లుక్ రిలీజ్!



టాలీవుడ్ సీనియర్ హీరో, కామెడీ కింగ్ అల్లరి నరేష్ నేడు తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి ‘రంభ ఊర్వశి మేనక’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా సీరియస్ ఎమోషనల్ కథలతో అలరించిన నరేష్, చాలా విరామం తర్వాత మళ్లీ తన మార్క్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. ‘యముడికి మొగుడు’ సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి “కామెడీ గోస్ కాస్మిక్” అనే ఒక క్రేజీ ట్యాగ్‌లైన్‌ను కూడా జత చేశారు, ఇది సినిమాలోని వినోద స్థాయి ఏ రేంజ్‌లో ఉండబోతోందో ముందే హింట్ ఇస్తోంది. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఛోటా కె ప్రసాద్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అల్లరి నరేష్ వింటేజ్ కామెడీ టైమింగ్‌కు తోడు ఫాంటసీ కథాంశం తోడవడంతో, సెప్టెంబర్ 4న బాక్సాఫీస్ వద్ద నవ్వుల పండగ ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com